కోసి.. పారబోసి..

నాలుగు రోజుల క్రితం కేజీ వంకాయలు రూ.20
నేడు రూ.4

- కూటమి కట్టి ధర తగ్గించిన వ్యాపారులు
- రవాణా ఖర్చులు కూడా రాక కాలువలో పోస్తున్న రైతులు



ఒక టీ తాగాలన్నా కనీసం రూ.10 చెల్లిస్తాం. అర లీటరు మంచినీటి బాటిల్ కొనాలంటే రూ.10 అవుతుంది. రైతు ఆరుగాలం కష్టించి పండించిన వంకాయలు మాత్రం కిలో రూ.4కు కూడా అమ్ముకోలేక అవస్థలు పడుతున్నాడు. నాలుగైదు రోజుల క్రితం పది కిలోల వంకాయల ధర మార్కెట్‌లో రూ.200 నుంచి రూ.250 ఉంది. పంట దిగుబడి పెరగడంతో వ్యాపారులు కూటమి కట్టి ధరను అమాంతం తగ్గించేశారు. రెండు, మూడు రోజులుగా వంకాయలు మార్కెట్టులో అడిగే వ్యాపారులు లేకుండా పోయారు. కోయకుండా వదిలివేస్తే మళ్లీ కాపు రాదని కూలి ఖర్చులు భరించి కోయిస్తున్నారు. మార్కెట్ తీసుకుపోతే రవాణా ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేకపోవటంతో కాలువలో పారబోస్తున్నారు. ఈ ఫొటోలో ఉంది అలాంటిదే. వెంపరాల రైతులు వంకాయలు కోసి సమీపంలో ఉన్న సాగర్ మేజర్ కాలువలో పారబోశారు. ఆదివారం మాత్రం 10 కిలోల వంకాయలు 40 రూపాయలు చొప్పున కొనుగోలు చేయటంతో కొంతమంది రైతులు మార్టూరు మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్ముకున్నారు. **- అద్దంకి, ఆంధ్రజ్యోతి**

లింగారెడ్డి బడికి స్థలం ఎంపిక



పాఠశాలకు స్థలం పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తర్లుపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీ లింగారెడ్డి కాలనీలో చర్చిలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలకు ఎట్టకేలకు స్థలాన్ని ఎంపిక చేశారు. దీన్ని తహసీల్దార్ కేకే కిశోర్ కుమార్, వీఆర్వో షరీఫ్, సర్వేయర్ మనోహర్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. 'చర్చిలోనే బడి' శీర్షికన ఈనెల 15న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలని తహసీల్దార్ కిశోర్‌కుమార్‌ను ఆదేశించారు. ఈమేరకు రెవెన్యూ అధికారులు పాఠశాల భవనం కోసం స్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రుల అభిప్రాయం ప్రకారం సర్వే నంబర్ 33లో పాఠశాల నిర్మించేందుకు అనువుగా ఉంటుందని అధికారులు గుర్తించారు. పాఠశాలకు 10 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

6 కోట్లు ఆవిరి!

ఎస్సీ కార్పొరేషన్‌లో తుప్పుపట్టిన డ్రెయిన్ క్లీనింగ్ యూనిట్లు

ఎస్సీ కార్పొరేషన్‌ను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. పథకాలను అటకెక్కించింది. బోర్డుకు మాత్రమే పరిమితం చేసింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసి పంపిణీకి సిద్ధం చేసిన యూనిట్లను కూడా లబ్ధిదారులకు ఇవ్వకుండా రాజకీయ స్వార్థంతో మూలనపడేసింది. దీంతో రూ.కోట్ల ప్రజాధనం నిరుపయోగమైంది. ముఖ్యంగా డ్రెయిన్ క్లీనింగ్ వాహనాలను స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఆరుబయట ఉంచడంతో అవి తుప్పుపట్టి పనికిరాకుండాపోయాయి. వాటిని తుక్కుకు వేలం వేసేందుకు ఇప్పుడు కార్పొరేషన్ అధికారులు సిద్ధమయ్యారు. మరోవైపు ఈ వాహనాలను పూర్తిస్థాయిలో సరఫరా చేయకుండానే బిల్లులు తీసుకున్న కాంట్రాక్టు ఏజెన్సీ బోర్డు తిప్పేసింది. అయినప్పటికీ బాధ్యులపై అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలివేసింది.



ప్రగతిభవన్ ఆవరణలో పాడైపోయి నిరుపయోగంగా ఉన్న డ్రెయినేజీ క్లీనింగ్ యూనిట్లు

- గత టీడీపీ హయాంలో లబ్ధిదారుల కోసం కొనుగోలు
- పంపిణీ చేయకుండా నిలిపివేసిన వైసీపీ ప్రభుత్వం
- ఇప్పుడు మరమ్మతులు చేయించినా పనిచేయవు
- తుక్కుకు వేలం వేసేందుకు సిద్ధమైన అధికారులు
- బిల్లులు తీసుకొని బోర్డు తిప్పేసిన ఏజెన్సీ సంస్థ
- ఇంజన్‌లు సరఫరా చేయకపోయినా వదిలేసిన వైనం

ఒంగోలు నగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వ హయాం(2014-19)లో ఒక వెలుగు వెలిగిన ఎస్సీ కార్పొరేషన్‌పై గత వైసీపీ పాలకులు అలవిమాలిన నిర్లక్ష్యం ప్రదర్శించారు. వారు అధికారంలోకి వచ్చే నాటికే లబ్ధిదారుల కోసం సిద్ధం చేసిన యూనిట్లను కూడా పంపిణీ చేయకుండా నిలిపివేశారు.

పనికిరాకుండా పోయిన డ్రెయిన్ క్లీనింగ్ యూనిట్లు

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు విలువైన యూనిట్లను ఇచ్చారు. ఇన్నోవా, ఇథియోస్ కార్లు, ట్రాక్టర్లు ఎస్సీ నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున అందజేశారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో మురుగు కాలువలను శుభ్రం చేసేందుకు ఎస్సీలకు డ్రెయిన్ క్లీనింగ్ మిషన్లను మంజూరు చేశారు. ట్రాక్టర్ ఇంజన్‌తోపాటు హైడ్రాలిక్ పవర్‌తో ఉన్న బాడీని ఏర్పాటు చేసి యూనిట్ విలువ రూ.15 లక్షలతో యంత్రాలను కొనుగోలు చేశారు. వీటిలో హైడ్రాలిక్ పవర్‌తో ఉన్న బాడీలు జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్‌కు చేరాయి. ఇంజన్‌లు వచ్చిన వెంటనే వీటిని అందించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం భావించింది. ఈలోపు 2019లో ఎన్నికలు వచ్చి అధికార మార్పిడి జరిగింది. వైసీపీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన వెంటనే యూనిట్ల పంపిణీని నిలిపివేసింది. 28 డ్రెయిన్ క్లీనింగ్ యూనిట్లకు సంబంధించిన బాడీలను స్థానిక ఎస్సీ కార్పొరేషన్ ఆవరణలో ఆరుబయట నిరుపయోగంగా ఉంచారు. ఆరేళ్లుగా ఇవి ఎండకు ఎండి వానకు తడిసి తుప్పుపట్టిపోయాయి. దీంతో వీటిని తుక్కు కింద వేలానికి అధికారులు సిద్ధమయ్యారు.



బోర్డు తిప్పేసిన ఏజెన్సీ

డ్రెయిన్ క్లీనింగ్ యూనిట్లను సరఫరా చేసేందుకు నాటి ఎస్సీ కార్పొరేషన్ అధికారులు కావలికి చెందిన ఒక ఏజెన్సీని ఎంపిక చేశారు. అమరావతిలోని ఎస్సీ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయమే ఆ ఏజెన్సీకి సరఫరా బాధ్యతలను అప్పగించింది. మొత్తం రూ.6కోట్లను చెల్లించింది. ఈ వ్యవహారంలో అప్పట్లో రాష్ట్రస్థాయిలో ఎస్సీ కార్పొరేషన్‌లోని ఓ ఉన్నతాధికారి కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. సదరు ఏజెన్సీ ఇంజన్లు సరఫరా చేయకుండానే బిల్లులు తీసుకుంది. అనంతరం ఆ ఏజెన్సీ బోర్డు తిప్పేసింది. వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు ఆ యూనిట్లను పంపిణీ చేయకపోవడంతోపాటు ఏజెన్సీ నుంచి రావాల్సిన వాటి గురించి ఏమాత్రం పట్టించుకోకుండా వదిలేసింది. దీంతో రూ.6 కోట్ల ఎస్సీ కార్పొరేషన్ నిధులు నిరుపయోగమయ్యాయి. ఇంతమొత్తంలో ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైనా అందుకు కారకులను గుర్తించి చర్యలు తీసుకోలేదు. ఏజెన్సీ ఎంపికలో కీలకపాత్ర పోషించిన అప్పటి రాష్ట్రస్థాయి అధికారి వైసీపీకి అభిమానిగా మారడంతో వదిలివేసినట్లు తెలుస్తోంది. దీనిపై ప్రస్తుత ప్రభుత్వమైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కామ్‌ప్యూటర్లు!

- సచివాలయాల్లో మూలనపడ్డ వైనం
- ఆరు నెలలుగా మరమ్మతులు కరువు
- సేవలందక ప్రజలకు ఇబ్బందులు

ప్రజలకు సేవలందించాల్సిన సచివాలయాల్లో కంప్యూటర్లు పనిచేయడం లేదు. ఆరు నెలలుగా కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో మార్కాపురంలో ఏ సచివాలయంలో కూడా సక్రమంగా సేవలందని పరిస్థితి నెలకొంది.



15వ సచివాలయంలో సీపీయూలు మరమ్మతులకు గురవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్న కంప్యూటర్ మానిటర్లు

మార్కాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో ఎలాంటి సేవలు అందాలన్నా కంప్యూటర్లు ఉండాలి. అవి సక్రమంగా పనిచేయాలి. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు, రిపోర్టులు, ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందించాలంటే సాంకేతిక సామగ్రి అవసరం. కానీ ఒక్కచోట కూడా కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయడం లేదు. మరమ్మతులకు గురైన వాటిని బాగుచేయించేందుకు అధికార యంత్రాంగం మొగ్గుచూపడం లేదు. ఆరు నెలలుగా ఈ పరిస్థితి నెలకొని ఉన్నా కనీస చర్యలు చేపట్టేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. మరమ్మతుల కోసం సీపీయూలు, ప్రింటర్లు రిపేరు చేసే వ్యక్తి వద్దకు చేర్చినా తనకు గతంలోని పెండింగ్ బిల్లులు ఇవ్వలేదని వాటిని బాగుచేసేందుకు ససేమిరా అంటున్నారు. దీంతో నెలలుగా ప్రజలు సచివాలయాల చుట్టూ తిరుగుతూ సేవలందక ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం

అన్ని సచివాలయాల్లోనూ కంప్యూటర్లు, ప్రింటర్లు సరిగా పనిచేయనిమాట వాస్తవమే. కొద్ది నెలలుగా సాంకేతిక యంత్ర సామగ్రి లేకపోవడంతో సేవలందించేందుకు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరలోనే వాటన్నింటికీ మరమ్మతులు చేయిస్తాం.

- డీవీఎస్ నారాయణరావు, మునిసిపల్ కమిషనర్, మార్కాపురం

పనిచేయని యంత్ర పరికరాలు

మార్కాపురంలో 20 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటిల్లో 2020లో ఏర్పాటు చేసిన సాంకేతిక యంత్ర సామగ్రే ఇప్పటికీ ఉంది. కొన్నాళ్లుగా అవి మరమ్మతులకు గురవుతూనే ఉన్నాయి. రిపేర్లు చేయిస్తున్నారు. కానీ ఆరు మాసాలుగా వాటికి మరమ్మతులు పూర్తిగా నిలిచిపోయాయి. 20 సచివాలయాల్లో ప్రస్తుతం ఒక్క కంప్యూటర్‌గానీ, ప్రింటర్‌గానీ పనిచేస్తున్న పరిస్థితి లేదు. కంప్యూటర్లతోపాటు మున్సిపాలిటీలోని వాటికి కూడా మరమ్మతులు చేయించేందుకు రూ.3 లక్షలతో అంచనాలు తయారు చేశారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వాటికి మరమ్మతులు చేయాలి. కానీ ఆ పనిని చేపట్టేందుకు ఏ కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడం గమనార్హం.



ప్రమాణస్వీకారం చేస్తున్న మద్దిపాడు ఏఎంసీ పాలకవర్గం

వ్యవసాయ మార్కెట్ కమిటీలు బలోపేతం

- పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం
- పాలకేంద్రానికి పూర్వవైభవం తెస్తాం
- మద్దిపాడు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారంలో మంత్రి స్వామి

7



కొత్తపట్నం మండలం పాదర్తిలో పంటను పరిశీలిస్తున్న కేరళ బృందం సభ్యులు

ప్రకృతి సాగు భళా

పంటలను పరిశీలించి ప్రశంసించిన కేరళ బృందం

ఒంగోలు కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు, రైతుల కృషి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని కేరళకు చెందిన బృందం ప్రశంసించింది. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు ఆదివారం కేరళ నుంచి 34 మంది సభ్యులతో కూడిన బృందం జిల్లాకు వచ్చింది. మద్దిపాడు, కొత్తపట్నం మండలాల్లో పర్యటించింది. కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు, రైతు మెంటార్ ట్రైనర్లతో కూడిన ఈ బృందం ఈనెల 29వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనుంది. ఈ క్రమంలో డీపీఎం సుభాషిణి నేతృత్వంలో బృంద సభ్యులు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. తొలుత మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు భూమిని పరిశీలించారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో 20 రకాల పంటలు సాగు చేస్తున్న విధానాలను అధ్యయనం చేశారు. కొత్తపట్నం మండలం పాదర్తిలో ఏ-గ్రేడ్ వేరుశనగను సాగుచేస్తున్న రైతు మస్తాన్ పొలాన్ని సందర్శించారు. ఆయన అనుసరిస్తున్న అంతర పంటలు, సరిహద్దు పంటల ప్రయోజనాలను బృంద సభ్యులు పరిశీలించారు. ఉద్యాన పంటలలో పీఎండీఎస్ విధానాన్ని అనుసరిస్తున్న కొత్తపట్నంకు చెందిన రైతు కాటా సురేంద్ర వ్యవసాయ భూమిని బృందం సభ్యులు పరిశీలించారు. ఆయన వ్యవసాయ భూమిలో వానపాముల వృద్ధి, నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు తీసుకుంటున్న సస్యరక్షణ చర్యలను తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మల్లేశ్వరి బయో రిసోర్స్ సెంటర్‌ను సందర్శించి అక్కడ ఘన జీవామృతం తయారీ ప్రక్రియ, విత్తనశుద్ధి చర్యలపై ప్రాక్టికల్ డెమోను పరిశీలించి అభినందించారు. ఈ పర్యటన ద్వారా తాము అనేక కొత్త అంశాలను తెలుసుకున్నామని వారు తెలిపారు. పర్యటనలో కేంద్ర బృందంతో పాటు రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డీవీ రాయుడు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఉన్నారు.

ముంచెత్తగా..

- పంచాయతీల్లో అధ్వానంగా పారిశుధ్యం
- నిధుల కొరతతో దిక్కుతోచని స్థితిలో కార్యదర్శులు
- బ్లీచింగ్ కొనుగోలుకు కూడా డబ్బులు లేని దుస్థితి
- గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని అధికారుల ఒత్తిడి

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పల్లెలన్నీ బురదమయంగా మారాయి. పంచాయతీల్లో నిధుల కొరత ఉండటంతో కార్యదర్శులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఒకవైపు ప్రభుత్వం పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించగా, మరోవైపు ఆయా పంచాయతీల ఖాతాల్లో చిల్లిగవ్వ కూడా లేని దుస్థితి నెలకొంది. మరికొన్ని మేజర్ పంచాయతీల్లో నిధులున్నా సర్పంచ్‌లు సహకరించని కారణంగా ఏ పనీ చేయలేకపోవడంతో పల్లెలు చెత్తతో నిండిపోతున్నాయి.



కంభంలో గిద్దలూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 729 గ్రామ పంచాయతీలున్నాయి. అందులో 11 స్పెషల్ గ్రేడ్, 75 గ్రేడ్-1 పంచాయతీలు, 265 గ్రేడ్-2, 373 గ్రేడ్-3 ఉన్నాయి. 500లోపు జనాభా ఉన్నవి ఐదు ఉన్నాయి. స్పెషల్ గ్రేడ్, గ్రేడ్-1 పంచాయతీల్లో కొంతమేర నిధులు ఉండగా మిగిలిన వాటిలో పైసా కూడా లేదు. జిల్లాలో వర్షాలతో గ్రామాల్లో ఎక్కడికక్కడ నీరు నిలుస్తోంది. దోమల ఉత్పత్తి పెరుగుతోంది. వ్యాధులు తీవ్రమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ముందస్తుగా ఆయా గ్రామ పంచాయతీల్లో ఉన్న నీటిని బయటకు పంపించి బ్లీచింగ్ చల్లేందుకు డబ్బులు కూడా లేవు. కొన్ని పంచాయతీల్లో అరకొర నిధులున్నా వాటిని డ్రా చేసుకునేందుకు పాలకవర్గాలు సహకరించకపోవడంతో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం ఒక్కో అంశాన్ని తీసుకొని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రను చేపట్టేలా చర్యలు తీసుకుంది. ఇంకోవైపు పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలతో రోజూ జిల్లా పంచాయతీ అధికారి నుంచి కార్యదర్శుల వరకు ఉదయం ఆరు గంటలకే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. అయితే క్షేత్రస్థాయి పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది.

అందని పాలకవర్గాల సహకారం

పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ కోసం బ్లీచింగ్, ఇతర సామగ్రి కొనుగోలు చేయాలంటే వేలల్లో ఖర్చవుతుంది. నిధుల కొరత ఉండటంతో కార్యదర్శులు పనులు చేసేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా పంచాయతీలకు ఒక్క పైసా వచ్చిన పరిస్థితి లేదు. పెండింగు బిల్లులు కూడా రాకపోవడంతో నిధులు వచ్చిన వెంటనే డ్రా చేసుకొనేందుకు సిద్ధంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను ఆరు నెలల క్రితం రాష్ట్రానికి విడుదల చేసినా అవి పంచాయతీ ఖాతాలకు ఇంకా జమకాలేదు.

జీతాలు రాక కార్మికులు దూరం

కేంద్రప్రభుత్వ నిధులను ఎక్కువ మొత్తంలో పారిశుధ్య నిర్వహణకు వినియోగించుకునే అవకాశం ఉంది. అయితే అవి మంజూరు కాకపోవడంతో సకాలంలో జీతాలు రాక పారిశుధ్య కార్మికులు కూడా పనులు మానుకున్న పరిస్థితి నెలకొంది. మరోవైపు గ్రామాల్లోని చెత్తను తరలించేందుకు ఆరేడు నెలల క్రితం 90 పంచాయతీలకు ట్రాక్టర్లు ఇచ్చారు. వాటి నిర్వహణకు కూడా డబ్బులు లేవు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఒకవైపు నిధుల కొరత, మరోవైపు నుంచి వస్తున్న ఒత్తిళ్లతో పంచాయతీ కార్యదర్శులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.



రాజసంలో మేటి.. రారాజుగా ప్రతీతి

- రేపు జాతీయ పులుల దినోత్సవం
- వాటి సంఖ్య ఏటా నల్లమలలో పెరుగుదల

7

శరవేగంగా సాగర్ కాలువల మరమ్మతులు

- ఇప్పటికే 90 శాతం పూర్తి

7

పెరిదేపి నాయకుల కృతజ్ఞతలు


సత్యను సన్మానిస్తున్న నాయకులు

కొండపి, జూలై27 (ఆంధ్రజ్యోతి): కొండపి ఏఎంసీ వైస్ చైర్మన్ పదవిని తమ గ్రామానికి చెందిన మార్పూరి వెంకటేశ్వరరావుకు కేటాయించినందుకు కృతజ్ఞతగా పెరిదేపి గ్రామ టీడీపీ నాయకులు ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావులను కలిసి శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ వైస్ చైర్మన్ మార్పూరి వెంకటేశ్వరరావు, నాయకులు రావిపాటి వెంకటరావు, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే పీ4 లక్ష్యం : జేసీ


దత్తత కుటుంబానికి పత్రాన్ని అందజేస్తున్న జేసీ గోపాలకృష్ణ

మద్దిపాడు, జూలై27 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే పీ4 లక్ష్యమని జేసీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. మల్లవరంలో దళిత మహిళ తవశం కోటేశ్వరి కుటుంబాన్ని జాయింట్ కలెక్టర్ సమక్షంలో టీడీపీ నాయకుడు నారి పెద్ది వరహాలుచౌదరి దత్తత తీసుకున్నారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునేందుకు సహకరించాలని జేసీ కోరారు. ఆమె కుమార్తె డిగ్రీ చదువుకోవడంతో ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో వి.జ్యోతి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్‌ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, ఎంపీటీసీ బోయపాటి వీరాంజనేయులు, మార్నేని కృష్ణారావు, మార్నేని సుబ్బారావు, మార్నేని రాఘవేంద్రరావు, నవులూరి శివకృష్ణ, ఏడుగుండ్ల సత్యనారాయణ, బోడపాటి సుబ్బారావు, రావి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

మద్దిపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై లోతైన అవగాహన, శిక్షణ కోసం కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన 34 మంది సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి బృందం ఆదివారం దొడ్డవరం గ్రామానికి చెందిన రామాంజనేయులు పొలాన్ని సందర్శించారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో 20 రకాల పంటల వైవిధ్యంతో సాగు చేస్తున్న విధానాలను వారు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. డీపీఎం సుభాషిణి నేతృత్వంలో పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్‌టెంట్ డీవీ.రాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం

● జూపూడి ప్రభాకరరావు

కొత్తపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో సీఎం చంద్రబాబు నాయుడు విఫలమయ్యారని వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జూపూడి ప్రభాకరరావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కొత్తపట్నంలో జరిగిన వైసీపీ బహిరంగ సభ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయటంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాదాసి వెంకయ్య, ఆదెన్న, కాకుమాను రాజశేఖర్, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, పిచ్చిరెడ్డి, కేవీ.రమణారెడ్డి, ఆళ్ళ రవీంద్రారెడ్డి, గోపాలరెడ్డి, జడ్పీటీసీ లక్ష్మీశారద, బొట్ల సుబ్బారావు పాల్గొన్నారు.

376 మందికి వైద్య పరీక్షలు


డాక్టర్లను సన్మానిస్తున్న నాయకులు

పొన్నలూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఒంగోలు వెంకటరమణ నర్సింగ్ హోమ్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 376 మందికి వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటికి సంబంధించి 110 మందికి, మెదడు, వెన్నుపూసకి సంబంధించి 150 మందికి, ఊపిరితిత్తుల వ్యాధికి సంబంధించి 56 మందికి, గుండెకి సంబంధించి 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో కంటికి సంబంధించి 32 మందికి కంటి చికిత్స కోసం హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. డాక్టర్లు చంద్రశేఖర్ సుబ్రహ్మణ్యేశ్వరి, వరుణ్ మిత్ర, జావేద్ అహ్మద్, సుధాకర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మండల నాయకులు మండవ ప్రసాద్, గుమ్మళ్ల వెంకట్రావు, మండవ మురళి మోహన్, పల్లపోతు రమేష్ బాబు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

మద్దిపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పాలకులు సంక్షోభంలోకి నెడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విమర్శించారు. ఆదివారం మద్దిపాడు వెలుగు కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం టి.మాలకొండయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఆగస్టు 12,13 తేదీలలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు కనిగిరిలో జరుగుతాయని తెలిపారు. మండల నాయకులు కనుపర్తి సుబ్బారావు మాట్లాడుతూ ఆకర్షణీయ పథకాల మాయాజాలంతో పాలకులు ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు. అనంతరం సంఘం మండల కార్యదర్శిగా ఉబ్బా వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా కొంగాల చిన్న, సభ్యులుగా పి.హనుమంతరావు, కవల శ్రీను, టి.మాలకొండయ్య, అయ్యన్న, అశోక్, మేరీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఉబ్బా ఆదిలక్ష్మి, కాకుమాను సుబ్బారావు, కె.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణలో భాగంగా అదానీ కంపెనీ ఇచ్చిన స్మార్ట్ మీటర్ల బిగింపును కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఆదివారం ఒంగోలులోని గాంధీనగర్, జడ్పీకాలనీ, ఆర్టీసీ కాలనీ, శివప్రసాద్‌కాలనీ, కొత్తడొంక, మిలటరీకాలనీ, యానాదిసంఘం, వడ్డివానికుంట తదితర ప్రాంతాల్లో వారు కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు రాంబాబు, కె.వెంకటేశ్వర్లులు మాట్లాడుతూ ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టాలని చెప్పిన మంత్రి నారా లోకేష్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని వారు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపును పో త్సహిస్తుందని ఆరోపించారు. అందువల్ల ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, రాజశేఖర్, ఎంఎస్.సాయి, మహేష్, దామా శ్రీనివాసులు, చిరంజీవి, తంబి శ్రీనివాసులు, దారా వెంకటేశ్వర్లు, ఎస్‌కే.పీరు, హరికృష్ణ, టి.దాసు, వీరస్వామి, ఆనంద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలపై ఐక్యంగా పోరాడాలి


మాట్లాడుతున్న సిద్ధయ్య

నాగులుప్పలపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజలపై భారం మోపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను ఐక్యంగా తిప్పికొట్టాలని హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం మాజీ కార్యదర్శి సిద్ధయ్య తెలిపారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పుగుండూరులోని రజక కళ్యాణ మండపంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టి.శ్రీకాంత్, యు.వెంకటేశ్వర్లు, నలతోటి రామారావు, జి.బసవపున్నయ్య, కాకాని సుబ్బారావు పాల్గొన్నారు.

పగిలిన మంచినీటి పైపులైన్

● మొక్కల కోసం గుంతలు తీస్తుండగా ధ్వంసమైన వైనం


పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న మంచినీరు

ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండ్ సమీపంలోని రైల్వే ఫ్లైవోవర్ వంతెనకు పడమర వైపున తాగునీటి పైప్‌లైన్ ఆదివారం సాయంత్రం పగిలిపోయింది. కొత్తపట్నం బస్టాండ్ నుంచి కొప్పోలు రోడ్డులో మొక్కలు నాటేందుకు ట్రాక్టర్‌తో గుంతలు తీశారు. అయితే కొప్పోలు వైపు ఉన్న కాలనీలకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్ పగిలి పోయింది. సాయంత్రం తాగునీటిని ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి విడుదల చేయడంతో ఒక్కసారిగా పగిలిన పైపులోనుంచి నీరు వృథాగా సైడుకాలువలోకి గంటసేపు ప్రవహించింది. అయితే ఈ విషయం గుర్తించిన స్థానికులు కార్పొరేషన్ అధికారులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

పేదల ఆరోగ్యానికి చంద్రబాబు పెద్దపీట

మంత్రి స్వామి

83 మందికి రూ. 72 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన మంత్రి స్వామి

టంగుటూరు(కొండపి), జూలై27 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మునుపు ఎన్నడూ లేనివిధంగా పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం సాయంత్రం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి స్వామి అనారోగ్యంతో చికిత్సలు చేయించుకున్న 83 మందికి 72 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి సాయం చేయడంతోపాటు, ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యసౌకర్యాలు కల్పిస్తున్నదని అన్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తూ వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ జరుగుమల్లి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై నీలిమీడియా విషం..

అయితే సహజలక్షణంగా పుణికిపుచ్చుకున్న నీలిమీడియా పనిగట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం సాగిస్తున్నదని మంత్రి విమర్శించారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల సంక్షేమ హాస్టళ్లలో దుర్భర పరిస్థితులున్నా, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ఆ మీడియాకి కనిపించలేదని మంత్రి విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో హాస్టళ్లకు కనీసం మెయింటెనెన్స్ చార్జీలు కూడా ఇచ్చిన పాపానపోలేదని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 143 కోట్ల రూపాయలతో హాస్టళ్లకు మరమ్మతులు చేశామని వివరించారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు జిల్లాకో ప్రత్యేక వైద్యాధికారిని నియమించామని, ఇవేమీ వైసీపీ ప్రభుత్వం చేయకపోగా పనిచేసే ప్రభుత్వంపై నీలిమీడియా విషం గక్కుతున్నదని స్వామి విమర్శించారు. ' స్మోకింగ్ ఆరోగ్యానికి హానికరమని... సాక్షి బ్రేకింగ్ న్యూస్ సమాజానికి హానికరం' అని మంత్రి అన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి సహకారం

ఎంపీ మాగుంట ● అమరవీరుల విజయస్థూపం ఏర్పాటు చేయిస్తామని హామీ ● ఘనంగా కార్గిల్ విజయ్‌దివస్


మాజీ సైనికుడిని సన్మానిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు(రూరల్), జూలై27(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంక్షేమ కోసం తన వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నగరంలో వీరజవానుల గుర్తింపుగా విజయస్థూం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమం జరిగింది. ముందుగా వీరజవానుల విజయస్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాగుంట మాట్లాడుతూ జిల్లాలో సైనిక స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ సైనికులు ఎప్పుడైనా తనను కలవవచ్చని, వారి సమస్యలు తప్పక పరిష్కరిస్తానని చెప్పారు. మాజీ సైనికుల రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెప్పల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం భారత్‌దేశం ఎంతో అధునాతన ఆయుధ సంపత్తి కలిగి ఉందని, ప్రపంచంలోనే అగ్రదేశాల సరసన నిలిచిందని చెప్పారు. కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం వీరోచితంగా పోరాడి పాకిస్తాన్ మూక సైన్యాన్ని మట్టుబెట్టిందని కొనియాడారు. ఒంగోలులో మాజీ సైనికుల కార్యాలయ భవనాలకు అర ఎకరం స్థలం కేటాయించాలన్నారు. అనంతరం మాజీ సైనికులను ఎంపీ మాగుంట ఘనంగా సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా అధ్యక్షుడు ఆలపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాశం వెంకటరెడ్డి, లింగాల జగన్‌రెడ్డి, జి.శ్రీనివాసాచార్యులు, రాంబాబు, సీబీఆర్.ప్రసాద్, శిరిగిరి రాజేష్‌కన్నా, అబ్దుల్ రహీం, కె.బ్రహ్మయ్య, శరత్‌బాబు, జి.కోటేశ్వరరావు, డి.కోటేశ్వరశర్మ, చుండూరి శ్రీరామూర్తి, రామకృష్ణారెడ్డి, క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకట్రావు, డాక్టర్ నల్లూరి నిఖిత, సైనిక సంక్షేమ శాఖ అధికారి రజినీకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కూటమి పాలనలోనే సాధ్యం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్


మహిళలకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కూటమి పాలనలోనే సాధ్యమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఆదివారం లింగంగుంట గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ మరోవైపు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తం అయ్యాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయని చెప్పారు. డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో దళితవాడలు మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండవ హరిప్రసాద్, దమ్ము లక్ష్మీనారాయణ, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపీనాథ్, గట్టినేని అయ్యన్న, పోతినేని శ్రీనివాసరావు, ముప్పా రవి, మందపల్లి శ్రీనివాసరావు, గోరంట్ల చిరంజీవి, నల్లూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'పోతుల' చొరవతో సమస్య పరిష్కారం

● సత్కరించిన లబ్ధిదారులు


పోతుల రామారావును సత్కరిస్తున్న కాలనీవాసులు

టంగుటూరు (కొండపి), జూలై 27 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు పంచాయతీలోని ప్రస్తుత బాపూజీ కాలనీవాసులైన 30 కుటుంబాలకు కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పూర్వీకులు దాదాపు 30 ఎకరాలు జీవనం కోసం దశాబ్దాల క్రితం కేటాయించారు. పేదలు సంఘంగా ఏర్పడి భూములపై వచ్చే ఆదాయంతో జీవిస్తున్నారు. అయితే కాలక్రమంలో 30 కుటుంబాల్లోని సభ్యుల సంఖ్య పెరిగి ఈ భూమిపై వచ్చే ఆదాయం విషయంలో సమస్య తలెత్తింది. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, లబ్ధి పథకాల విషయంలో కూడా అనుభవదారుల మధ్య సమస్య తలెత్తిన విషయం పోతుల రామారావు దృష్టికి వచ్చింది. దీంతో స్పందించిన పోతుల రామారావు అనుభవిస్తున్న కుటుంబాల సభ్యులను పిలిచి వారితో పలు దఫాలు ఓపికగా సమావేశం ఏర్పాటు చేసి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చెప్పారు. దీంతో లబ్ధిదారులు, సంఘం సభ్యులు ఆదివారం పోతుల రామారావును ప్రత్యేకంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. సాయం చేయడంలో పూర్వీకుల ఒరవడిని కొనసాగించి తమకు అండగా నిలిచిన కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావుకు ఆయన సోదరులు పోతుల కృష్ణారావు, నరసింహారావు, రాజేంద్రప్రసాద్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

మగ ఆరోగ్య కార్యకర్తలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

● రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విధుల నుంచి తొలగించిన మగ ఆరోగ్యకార్యకర్తలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు కోరారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వై.సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. రీ డిప్లోయిమెంట్ విధానం వల్ల మహిళా ఉద్యోగులు సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఆ విధానాన్ని ప్రభుత్వం తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీని నియమించి వెంటనే ఐఆర్ ఇవ్వాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలన్నారు. గ్రామ, వార్డు హెల్త్‌సెక్రటరీలను వైద్యశాఖ పరిధిలోని తీసుకురావాలని కోరారు. యూనియన్‌ను బలోపేతం చేసేందుకు ఉద్యోగులందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబరు 31నుంచి వచ్చే ఏడాది 4వతేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బెజవాడ వెంకటేష్, ఎం.నాయక్, పి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంకు నోటీసులు

● మధ్యాహ్న భోజనంలో అవకతవకలపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం

ఒంగోలు విద్య, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో చోటుచేసుకున్న అవకతవకలపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవికి పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనం కోసం ప్రతి విద్యార్థికి రోజుకు 150 గ్రాముల బియ్యం ఇవ్వాలి. అయితే హెచ్‌ఎం కుకింగ్ ఏజెన్సీకి తగ్గించి ఇవ్వడం ద్వారా నిబంధనలను ఉల్లంఘించారు. పాఠశాలలో వెయ్యిమంది విద్యార్థినులు ఉండగా రోజుకు కేవలం 400నుంచి 500 గుడ్లు మాత్రమే ఇచ్చారు. దీంతో బియ్యం, గుడ్లు మార్కెట్లో విక్రయించి దశలవారీగా ఆ మొత్తాలను తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయడం ద్వారా అక్రమాలకు పాల్పడ్డారని అభియోగపత్రంలో పేర్కొన్నారు. దీనిపై పది రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వాలని ఆర్‌జేడీ నోటీసుల్లో హెచ్‌ఎంను ఆదేశించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు.. ఐదుగురికి గాయాలు

ఒంగోలు క్రైం, జూలై27(ఆంధ్రజ్యోతి): ఇసుకలోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను కారు ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం పెళ్ళూరు ఫ్లైఓవర్ సమీపంలో జరిగింది. విజయవాడకు చెందిన మల్లిఖార్జునరావు తన కుటుంబసభ్యులుతో కలిసి చెన్నయ్ వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. దీంతో మల్లిఖార్జునరావు, ఆయన భార్య కవిత, కుమారులు జయేంద్ర, శివానందతో పాటు డ్రైవర్ నరేంద్ర గాయపడ్డారు. కారు నుజ్జునుజ్జు అయింది. కవిత పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈమేరకు క్షతగాత్రులను ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఒంగోలు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో రెండు చోట్ల చోరీలు

ఒంగోలు క్రైం, జూలై27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని రెండు ప్రాంతాల్లో చోరీలు జరిగాయి. రూ.2.10 లక్షల నగదు, 25 ఫుల్ బాటిళ్ల మద్యం అపహరించుకెళ్ళారు. శనివారం రాత్రి పేర్నమిట్ట సమీపంలోని శ్రీసాయి శరవణ పప్పుమిల్లు ఆఫీస్‌తాళం పగులగొట్టి లోపలికి చొరబడి బీరువాను పెకలించి రూ.2లక్షల నగదు చోరీ చేశారు. అదేవిధంగా మంగమూరురోడ్డు జంక్షన్‌లో గల తేజస్విని బార్ అండ్ రెస్టారెంట్ షట్టర్‌కు వేసిన తాళం కోసి రూ.10వేల నగదు, 25ఫుల్ బాటిళ్ళ మద్యం అపహరించుకెళ్ళారు. రెండు ప్రాంతాలను తాలుకా పోలీసులు పరిశీలించారు.

మహిళలకు చీరల పంపిణీ


చీరలను అందజేస్తున్న డాక్టర్ నరసింగరావు, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల మాజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, బీజేపీ నేత, మౌర్య హోటల్స్ వ్యవస్థాపకుడు స్వర్గీయ బత్తిన నరసింహారావు వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. టంగుటూరు మండలం మర్లపాడు గ్రామంలో పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ముందుగా నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బత్తిన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కొమ్మి నరసింగరావు, ఓబీసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రావులపల్లి నాగేంద్రయాదవ్, మౌర్య ఎండీ బత్తిన మహేష్, టీడీపీ మహిళ నాయకురాలు ఎం.నారాయణమ్మ, సీహెచ్.సునీత, మాజీ సర్పంచ్ కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను సాధించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని ఐఏఎస్ స్ట్రాటజిస్ట్ జమీర్‌అహ్మద్ అన్నారు. స్వర్గీయ షంషీర్ అహ్మద్ స్మారక సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక హైదరీక్లబ్‌లో జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఐఏఎస్, ఐపీఎస్ పరీక్షల్లో విజయం సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను వివరించారు. ఒంగోలులో ఇటువంటి ఇన్‌స్టిట్యూట్‌లు ఉండటం వల్ల ఉన్నత లక్ష్యాలకు చేరుకునే వారు హైదరాబాద్, ఢిల్లీలాంటి నగరాలకు వెళ్ళకుండా ఆ స్థాయి శిక్షణ ఇక్కడే పొందవచ్చని చెప్పారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నూకతోటి రవికుమార్, రిటైర్డ్ తహసీల్దార్ ఇస్మాయిల్, ఎస్ఎకే.జిలానీ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో బంగారు పతకం


బంగారు పతకం అందుకుంటున్న సాన్విశ్రీవరేణ్య

ఒంగోలు కల్చరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఒంగోలుకు చెందిన ఆరు సంవత్సరాల చిన్నారి పల్లపోతు సాన్విశ్రీవరేణ్యకు చిత్రలేఖనంలో బంగారు పతకం లభించింది. స్థానిక రంగుల ఆర్ట్ గ్యాలరీలో శిక్షణ పొందుతున్న సాన్విశ్రీవరేణ్య రాజమండ్రిలో భగీరథీ ఆర్ట్ ఫౌండేషన్ నిర్వహించిన నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్‌లో చిల్డ్రన్ సబ్ జూనియర్స్ విభాగంలో ఆమె బంగారు పతకం పొందింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారి మురళికృష్ణ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ చేతులమీదుగా నిర్వాహకులు గోల్డ్ మెడల్‌ను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సాన్విశ్రీవరేణ్యకు రంగుల ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకురాలు రంగుల సంధ్య, పలువురు కళాభిమానులు అభినందనలు తెలిపారు.

ఘనంగా నందిపాడు సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకారం


చైర్మన్ నాగేశ్వరరావును సత్కరిస్తున్న సభ్యులు

మద్దిపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నందిపాడు సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. మద్దిపాడులోని సొసైటీ కార్యాలయంలో కమిటీ చైర్మన్‌గా ఉప్పుగుండూరి నాగేశ్వరరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందజేస్తామని, రైతుల అభ్యున్నతే తమ లక్ష్యమన్నారు. రైతులు సొసైటీలో డిపాజిట్ చేసి అధిక వడ్డీ పొందాలని, వ్యవసాయ పరికరాలకు రుణాలు అందజేస్తామని చెప్పారు. సొసైటీ సభ్యులు బోడపాటి సుబ్బారావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు మరింత వడ్డీ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో నరహరి రామచంద్రారెడ్డి, మాదాల చిరంజీవి, బత్తిన సురేంద్రబాబు, అన్నమనేని సుబ్బారావు, కడియాల రఘుబాబు, రావి వెంకటేశ్వర్లు, కనపర్తి శేషయ్య, ఘడియపూడి సత్యం, బాపట్ల వెంకయ్య, నవులూరి శివకృష్ణ, నూనె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

42మందికి ఉద్యోగావకాశాలు

మద్దిపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 42మందికి ఉద్యోగావకాశాలు లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజయాదవ్ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాకు 87 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మిడ్‌వెస్ట్, హెటిరో, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, అపెక్స్ సొల్యూషన్స్ వంటి 10 బహుళ జాతీయ కంపెనీలు వచ్చి 42 మందిని ఎంపిక చేశాయి.

పీ4కి అర్హులను గుర్తించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న సంధ్యారాణి

టంగుటూరు (కొండపి), జూలై27 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ పరిధిలోని పాఠశాలల హెచ్‌ఎంలు ప్రజా ప్రభుత్వం చేపట్టిన పీ4 పథకానికి అర్హులైన విద్యార్థులను గుర్తించి, వారి వివరాలను అందజేయాలని క్లస్టర్ హెచ్‌ఎం సంధ్యారాణి ఆదేశించారు. శనివారం, ఆదివారం ఆమె క్లస్టర్ పరిధిలోని కారుమంచిలోని పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయా స్కూళ్లలోని రికార్డులను పరిశీలించారు. పాఠశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని, మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేయాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థులతో శక్తి టీంలను ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయ సిబ్బందికి సూచించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీలు బలోపేతం

పొగాకు రైతులకు అండగా ప్రభుత్వం
పాలకేంద్రానికి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి
మద్దిపాడు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారంలో మంత్రి స్వామి
పాల్గొన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు



చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న మన్నం రాజేశ్వరీప్రసాద్, పక్కన మంత్రి స్వామి, ఎంపీ కృష్ణప్రసాద్,ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తదితరులు

చీమకుర్తి,జూలై27(ఆంధ్రజ్యోతి): రైతులకు వెన్నుదన్నుగా ఉండేలా వ్యవసాయ మార్కెట్ కమిటీలను బలోపేతం చేసే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టినట్లు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం సంతనూతలపాడు ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం అట్టహాసంగా జరిగింది. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీలు తెన్నేటి కృష్ణప్రసాద్, మాగుంట శ్రీనివాస రెడ్డి,ఎమెల్యేలు దామచర్ల జనార్దన్, విజయ్‌కుమార్, ,మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, యర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ పొగాకు రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందన్నారు.బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియను చేపట్టి పేద రైతుల ప్రయోజనాలు కాపాడిందన్నారు.అదనపు పంటకు సెస్ విధించకుండా కేంద్రప్రభుత్వంతో మాట్లాడామని తెలిపారు. పేర్నమిట్ట వద్ద ఉన్న పాలకేంద్రానికి పూర్వ వైభవం తెచ్చే ప్రయత్నాలు చేపట్టామని వివరించారు. పని చేసే ప్రభుత్వంపై నిందలు వేయటం సరికాదన్నారు.నీలి మీడియాలో విషపు రాతలు రాయటం మానుకోవాలన్నారు.ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడి పనిచేసినవారికి పదవులు ఇవ్వటంలో తనపాత్ర కూడా ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఏఎంసీ నూతన పాలకవర్గానికి తాను అన్నివిధాలా అండగా ఉండి సహాయసహకారాలు అందిస్తానన్నారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అలాగే ఒంగోలు ఎంపీ శ్రీనివాసరెడ్డి,ఎమ్మెల్యే జనార్దన్,దామచర్ల సత్య,నూకసాని బాలాజీలు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల సమక్షంలో ప్రమాణస్వీకారం..

మద్దిపాడు ఏఎంసీ చైర్మన్‌గా మన్నం రాజేశ్వరీ, వైస్‌చైర్మన్‌గా షేక్ ఖాజావలీ మరో 13మంది సభ్యులు సభకు హాజరైన ప్రజలు,ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.ఏఎంసీ సెక్రటరీ పి.ధనమ్మ అందరిచేత ప్రమాణం చేయించారు.డైరెక్టర్లుగా వడ్డెంపూడి సుశీల,ముచ్చు సుబ్బారావు,వెన్నపూస రాజశేఖరరెడ్డి,తేళ్ల వరమ్మ,పైడి నాగేశ్వరరావు, భువనగిరి వెంకాయమ్మ, కండ్లగుంట వెంకట శ్రీలత, కామేపల్లి శ్రీనివాసరావు, మారెళ్ల శ్రీనివాసరావు, మిరియాల వెంకటరమణమ్మ, మద్ది వెంకట్రావు, కొణిజేటి ధనుష్, పఠాన్ పర్వీన్‌లు ప్రమాణం చేశారు.నాలుగుమండలాల నుంచి పెద్దఎత్తున విచ్చేసిన టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు, కార్తకర్తలతో సభ నిండిపోయింది. మహిళలు అధిక సంఖ్యలో సభకు హాజరుకావటం విశేషంగా నిలిచింది.సభకు సమన్వయ కర్తగా గొల్లపూడి సుబ్బారావు వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కందుకూరి బాబు,టీడీపీ నాయకులు మన్నం ప్రసాదు,పరిశీలకులు చౌటా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు,రైతు నాయకులు నెప్పలి సుబ్బారావు,నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు,గొట్టిపాటి రాఘవరావు,తేళ్ల మనోజ్‌కుమార్, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు,చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, నాయకులు యడ్లపల్లి రామబ్రహ్మం, గొల్లపూడి వెంకట్రావు, రావిపాటి రాంబాబు, కాట్రగడ్డ రమణయ్య,ఉన్నం సుబ్బారావు,శిద్దా సుధాకర్, బొమ్మినేని రామాంజనేయులు, వివరం గోవిందు, రంపతోటి అంకారావు, తన్నీరు శ్రీనివాసరావు, నాగులుప్పలపాడు మండల నాయకుడు గుమ్మడి సాయిబాబు, మండల చినరంగారావు, కాకర్ల లక్ష్మీవర ప్రసాదరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నేతలు

పొగాకు రైతుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

● మంత్రి స్వామికి రైతుసంఘం నేతల వినతి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వర్జీనియా పొగాకు రైతుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం ప్రతినిధుల బృందం కోరింది. ఆదివారం మంత్రి స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో రైతు సంఘం ప్రతినిధులు మంత్రి స్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షాభావం, పంట దిగుబడి తక్కువ రావడం వల్ల ఈ ఏడాది అధికంగా లోగ్రేడ్ పొగాకు ఉత్పత్తి అయిందన్నారు. అయితే కొనుగోలుకు సరైన ధర లభించడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రూ. 20వేల కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తే రైతులు భారీ నష్టాలు చవిచూడాల్సి వస్తోందన్నారు. దాని వల్ల ప్రతి బ్యారెన్‌కు రూ. 5నుంచి 6 లక్షల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం తక్షణ సాయంగా రూ. వెయ్యి కోట్లు విడుదల చేసి లోగ్రేడ్ పొగాకును ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేసే విధంగా చూడాలని మంత్రిని కోరారు. అలాగే అదనపు పొగాకుపై అపరాధ రుసుంను రద్దు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి స్వామిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ అదనపు పొగాకు పంటపై అపరాధ రుసుం వసూలు చేయవద్దని బోర్డు అధికారులకు సూచించామన్నారు. లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రి వర్గంలో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి స్వామిని కలిసిన వారిలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, ప్రతినిధులు జే జయంతిబాబు, అబ్బూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీనివాసరావు, కొల్లూరి వెంకటేశ్వర్లు, కిలారు పెద్దబ్బాయి, కే సుబ్బారావు, పోలవరపు జనార్దన్, చుండూరి శేషయ్య, షేక్ సైదావలి, గొల్లపల్లి సురేష్, చెరుకూరి వాసు, గాలి నాగేశ్వరరావు, దాసరి ఆంజనేయులు తదితరులు ఉన్నారు. అలాగే ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.

పరీక్షకు 124 మంది హాజరు

ఒంగోలు విద్య, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలం వల్లాపల్లిలోని సీఏ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుకు ఆదివారం నర్సరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షకు 124 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు 454 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా కేవలం 124 మంది మాత్రమే హాజరయ్యారు. సీబీటీ పరీక్షకు హాజరు కావాలని గుంటూరు ఆర్‌జేడీ కార్యాలయం, ఒంగోలు డీఈవో కార్యాలయం నుంచి అభ్యర్థులకు ఫోన్లు చేసి చెప్పినా కేవలం నాల్గవవంతు మాత్రమే అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు గంట ముందుగానే చేరుకున్నారు. పరీక్ష ప్రశాంతంగా జరిగింది.




నిందితుడిని అరెస్టు చేసి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లను చూపుతున్న పోలీసులు

ప్రయాణికుడి వలే బస్సు ఎక్కి.. ల్యాప్‌టాప్‌ల చోరీ

● నిందితుడి అరెస్టు ● 10 స్వాధీనం

ఒంగోలు క్రైం, జూలై 27(ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణికుడు వలే ఎక్కి ల్యాప్‌టాప్‌లు దొంగిలించే విసా రమేష్ బాబును అరెస్టు చేసి 10 ల్యాప్ ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. కందుకూరుకు చెందిన విసా రమేష్ బాబు రెండేళ్లుగా ల్యాప్‌టాప్‌లు దొంగిలిస్తూ వాటిని విక్రయించి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవాడు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఆగిన బస్సులలో ప్రయాణికులు కిందకు దిగన సమయంలో వారి సీట్లో పెట్టిన ల్యాప్ టాప్‌ను దొంగిలించేవాడు. ఇలా రెండేళ్లగా రమేష్‌బాబు ల్యాప్‌టాప్‌లను దొంగిలించాడు. ఈనెల 5 న విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న బస్సులో పి.సుధాకర్ తన ల్యాప్‌టా ప్‌ను సీట్లో పెట్టి వాటర్ బాటిల్ కోసం దిగాడు. ఆయన వచ్చే సరికి ల్యాప్‌టాప్ కనిపించలేదు. ఈమేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణచేపట్టారు. ఆర్టీసీ డిపోలో సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. అతని వద్ద 10 ల్యాప్‌ట్యాప్‌లు, (విలువ రూ. 2.5 లక్షలు) వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితుడు నగరంలోని భాగ్యనగర్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా ఆదివారం సాయత్రం అదుపులోకి తీసుకొని విచారించిన అనంతరం అరెస్టు చేశామని తెలిపారు. కేసు దర్యాప్తులో ఎస్సై ఎం.సువర్ణ , ఏఎస్సైపీఎస్‌కే.సురేష్, హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.సాయి, విజయ్, కానిస్టేబుల్ అనిల్‌ను సీఐ అభినందిచారు.

రాజసంలో మేటి రారాజుగా ప్రతీతి



నల్లమలలో సంచరిస్తున్న పెద్దపులి

● రేపు జాతీయ పులుల దినోత్సవం ● ఏటా నల్లమలలో పెరుగుతున్న వాటి సంఖ్య ● సంరక్షణకు డ్రోన్లతో రెస్క్యూ ఆపరేషన్

పెద్దదోర్నాల,జూలై 27(ఆంధ్రజ్యోతి): హుందాతనంతో రాజసం ఉట్టిపడే పుచ్చుకున్న జంతువు పెద్దపులి. దేశంలోనే అతి పెద్ద అభయారణ్యాలలో రెండోది అయిన నల్లమల పెద్దపులికి ఆవాసం.అందుకే పెద్దపులి నల్లమల రారాజుగా భాసిల్లుతోంది.ఏటికేడు పులుల సంఖ్య పెరుగుతోంది. పెద్ద పులుల సంఖ్య పెరుగుతుండడం శుభపరిణామంగా అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. తద్వారా పర్యావరణ సమతుల్యం పరిరక్షించబడుతుందని వాటి సంరక్షణకు డ్రోన్ల రెస్క్యూ ఆపరేషన్లతో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏటా జూలై 29న జాతీయ పులుల దినోత్సవాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

నల్లమలలో 87 పులులు

నల్లమల అభయారణ్యం ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల్లో 3,040.74 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. గత ఏడాది జాతీయ పులుల సంరక్షణ అథారిటీ(నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) నిర్వహించిన గణనలో 84 పులులున్నట్లు నిర్ధారించింది. అయితే ఈ ఏడాది సాధారణ గణన చేపట్టగా 87 వరకు ఉన్నట్లు భావిస్తున్నారు. భవిష్యత్తులో వీటి సంతతి మరింత పెరిగే అవకాశం ఉందని అటవీ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు.ప్రస్తుత సమయం పులుల ప్రత్యుత్పత్తికి అనుకూలం కావడంతో మూడు నెలల పాటు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించారు.ఈ క్రమంలోనే జూలై ప్రారంభం నుంచి సెప్టెంబరు మాసాంతం వరకు అటవీ ప్రాంతంలోకి జన సంచారానికి అనుమతులు నిషేధించారు.ప్రకృతి ప్రేమికుల పర్యటన కోసం తుమ్మల బైలు, రోళ్లపెంట వద్ద ఏర్పాటు చేసిన ఎకోటూరిజం సందర్శన, లోతట్టు అటవీ ప్రాంతలోని ఇష్టకామేశ్వరి దేవాలయం దర్శనం నిలిపివేశారు.



చెట్లకు కెమెరా ఏర్పాటు చేస్తున్న అటవీ అధికారులు

పులుల గణన చేసేదిలా..

దేశ వ్యాప్తంగా నాలుగేళ్లకు ఒకసారి పులుల లెక్కింపు జరుగుతుంది. పులులు సంచరించే ప్రాంతాలను ముందుగా గుర్తిస్తారు. అవి ఎక్కువగా సంచరించే చోట పెద్ద చెట్టుకు పంజాతో గోకి తన పరిధిని నిర్దేశించుకుంటాయి. ఆ చెట్ల గుర్తులను, అవి నడిచిన పాదముద్రలను సేకరించడంతో పాటు కెమెరాలు ఏర్పాటు చేస్తారు. రహదారులకు ఇరు వైపులా చెట్లకు 40 సెంటీమీటర్ల ఎత్తులో అమర్చుతారు. ఈ పరిధిలో ఏ జంతువు వెళ్లినా వెంటనే ఫొటోలు తీస్తాయి. కెమెరాలలో నిక్షిప్తమైన ఫొటోల ఆధారంగా పాద ముద్రల ద్వారా పులుల సంఖ్యను యుద్ధ ప్రాతిపదికన లెక్కింపు చేసిన మీదట అంచనాకు వస్తారు. డిసెంబరు మాసం నుంచి 40 రోజుల పాటు ఈ ప్రక్రియను నిర్వహిస్తారు.ఈ క్రమంలో 2014లో 72పులులు ఉన్నట్లు చెప్పారు. గతేడాదికి గణనీయంగా పెరిగి 84 వరకు చేరుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది లెక్కింపు ప్రక్రియ పూర్తి కాలేదని 87 సంఖ్యకు చేరినట్లు అధికారులు చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నల్లమల అటవీ ప్రాంతం సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖాధికారులుహెచ్చరిస్తున్నారు. అడవిని అనుకుని సుమారు 200 గ్రామాలున్నాయి. ఆ పరిసర పొలాల్లో పంటలు సాగు చేసే రైతులు మరింత జాగరూకతతో ఉండాలి. ఇటీవలే ఆత్మకూరు కొత్తపల్లి రేంజి సదరం పెంట గూడెంకు చెందిన పులిచెర్ల అంకన్నపై పులి దాడి చేయడం కలకలం రేపింది.పెద్దచెర్వులో ఇంటి పరిసరాల్లో తిరిగి వెళ్లినట్లు గిరిజనులు తెలిపారు.నాగలూటి చెక్‌పోస్టు వద్ద, శ్రీశైలం పరిసరాల్లో పులులు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.

డ్రోన్లతో రెస్క్యూ ఆపరేషన్

పెద్దపులుల సంరక్షణకు అటవీ శాఖాధికారులు పటిష్టమైన చర్యలతో పాటు సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రోన్లను వినియోగించడం వల్ల జంతువుల బాగోగులు పరిశీలించేందుకు సుగమం అవుతుందని, ఐదారు కిలోమీటర్ల పరిధిలో జంతువుల ఉనికిని గుర్తించవచ్చని తెలిపారు. అనారోగ్యంతో, ఉచ్చుల భారీ నుంచి తప్పించుకుని బాధపడే జంతువుల వద్దకు రెస్క్యూ టీం వెళ్లి మత్తు ఇచ్చి వాటికి వైద్యం అందించ వచ్చన్నారు. ఈ క్రమంలో వేటగాళ్ల ఉచ్చుల నుంచి తప్పించుకొని తిరుగుతున్న 132 నంబరు గల ఆడపులి కోసం రుద్రకోడూరు బీట్‌లో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన దానిని గుర్తించి పట్టుకుని చికిత్సలు నిర్వహించి తిరుపతి జూకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

శరవేగంగా కాలువల మరమ్మతులు

● ఇప్పటికే 90 శాతం పూర్తి
● చివరి భూములకు సక్రమంగా నీరందే అవకాశం
● రైతుల్లో ఆనందం



ఒంగోలు బ్రాంచ్ కాలువలో పూడిక తీసి చేసిన మరమ్మతులు

దర్శి, జూలై 27(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువల మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తిచేశారు. అక్కడక్కగా మిగిలిపోయిన పనులను చేస్తున్నారు. ఈఏడాది సాగర్ జలాలు ముందుగా విడుదల చేస్తారనే ఉద్దేశంతో అందు కనుగుణ ంగా నీరు విడుదలయ్యేలోపు పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం సాగర్ కాలువల మరమ్మతుల గురించిన పట్టించుకున్న పాపానపోలేదు. కనీసం చిల్లచెట్లు కూడా తొలగించకపోవటంతో అడవిలా పెరిగి నడిచేందుకు వీలులేకుండా ఉంది. కాలువల్లో పూడిక పెరిగి సాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత సాగర్ కాలువల దుస్థితిని గుర్తించి మరమ్మతులకు నిధులు విడుదల చేశారు.

ఒంగోలు బ్రాంచ్ కాలువతో పాటు దర్శి-2 సబ్ డివిజన్‌లోని మేజర్లు, మైనర్ల మరమ్మతులు చేస్తున్నారు. ఒంగోలు బ్రాంచ్ కాలువ కట్టపై పెరిగిన చిల్లచెట్లు పూర్తిగా తొలగించారు. కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. ప్రస్తుతం ఒంగోలు బ్రాంచ్ కాలువను పరిశీలిస్తే అద్దంలా కనిపిస్తుంది. దర్శి బ్రాంచ్ కాలువతో పాటు ఆ పరిధిలోని మేజర్ల మరమ్మతులు కూడా దాదాపు పూర్తయ్యాయి. సాగర్ ప్రధాన కాలువ, దర్శి, పమిడిపాడు బ్రాంచ్ కాలువలతో పాటు ఆ ప్రాంతంలోని మేజర్లను రూ.1.08 కోట్లతో మరమ్మతులు చేశారు. దర్శి-2 సబ్ డివిజన్ పరిధిలో రూ.60 లక్షలతో మరమ్మతులు చేశారు. కాలువల మరమ్మతులు పూర్తికావటంతో సాగునీటి పంపిణీ సాఫీగా జరిగే అవకాశాలు ఉన్నాయి. కాలువలను చూసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత కొన్నిసంత్సరాలుగా సాగర్ కాలువల అభివృద్ధిని పట్టించుకోకపోవటంతో చివరి భూములకు నీరందక ఎంతో ఇబ్బందిపడ్డారు. ఈఏడాది ప్రధాన కాలువ, బ్రాంచ్, మేజర్లు, మైనర్లతో పాటు అవసరమైన అన్ని మరమ్మతు పనులు చేయటంతో అన్నీప్రాంతాల్లోని ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందే అవకాశం ఉంది. ఆగస్టు మొదటివారంలో సాగర్ జలాలు విడుదల చేస్తారనే వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆయకట్టు రైతులు ఇప్పటికే బోర్లకింద నారు పోశారు. సాగర్ జలాలు విడుదల కాగానే ముందుగా వరినాట్లు వేసుకునేందుకు భూములను సన్నద్ధం చేస్తున్నారు. మిగిలిన రైతులు సాగర్ జలాలు రాగానే వరినారు పోసేందుకు సంసిద్ధమవుతున్నారు.



రాకపోకలకు అనువుగా చిల్లచెట్లు తొలగించి శుభ్రం చేసిన సాగర్ కాలువ కట

ఓవర్ లోడ్ వద్దు.. పాసింగ్ ముద్దు!

● 10 రోజులుగా టిప్పర్ యజమానుల ఆందోళన
● నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ఒంగోలు క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : అధికారులు పక్షపాత వైఖరి అనుసరిస్తున్నారని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. క్రషర్‌లు, క్వారీ యజమానుల తీరును నిరసిస్తూ ఒంగోలులోని టిప్పర్ యజమానులు ఆందోళనబాట పట్టారు. గత పది రోజులుగా లారీలను నిలిపివేసి వివిధ రూపాల్లో నిరసన తెలిన వారు 'ఓవర్ లోడ్ వద్దు.. పాసింగ్ (పరిమితికి లోబడి రవాణా) ముద్దు' అని నినదిస్తున్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాకు సిద్ధమయ్యారు. మూడు రోజుల క్రితం రవాణా శాఖ జాయింట్ కమిషనర్ ఒంగోలులో ఆశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించినా సమస్య కొలిక్కి రాకపోవడంతో ఈమేరకు వారు నిర్ణయం తీసుకున్నారు. చీమకుర్తి నుంచి గ్రానైట్, కంకర, క్వారీ డస్ట్ జిల్లాతోపాటు ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. ఈనేపథ్యంలో అటు పోలీసులు, ఇటు రవాణా శాఖ, విజిలెన్స్ అధికారులు ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు తనిఖీలు చేస్తూ ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నారు. శనివారం రాత్రి కూడా 9 టిప్పర్లపై కేసులు పెట్టారు. చీమకుర్తి నుంచి గ్రానైట్, కంకర, డస్టు రవాణా చేసే లారీలు, టిప్పర్లు సుమారు 1,000 ఉంటాయి. వీటిలో సగం క్రషర్‌లు, క్వారీ యజమానులకు చెందినవి. ఈ వాహనాలు ఓవర్ లోడ్‌తో వెళ్తున్నా అధికారులు కేసులు రాయడం లేదని ఒంగోలు టిప్పర్ యజమానులు ఆరోపిస్తున్నారు. తమపై కక్ష కట్టినట్లు కేసులు నమోదు చేస్తుండటంతో జరిమానాలు చెల్లించలేక అవస్థ పడుతున్నామని వాపోతున్నారు. మేము పాసింగ్ (పరిమితికి లోబడి) మాత్రమే రవాణా చేస్తామంటే క్రషర్‌లు, క్వారీ యజమానులు లోడ్ ఇవ్వడం లేదని వాపోతున్నారు.

జేటీసీ సమీక్ష అనంతరం కూడా కనిపించని మార్పు

ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ ఒంగోలులోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో రవాణా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓవర్ లోడ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే పాసింగ్ లోడ్ రవాణా చేస్తామని ఆందోళన చేస్తున్న వారికి మాత్రం లోడ్ దొరికే మార్గం సుగమం చేయలేదు. దీంతో పాసింగ్ మాత్రమే రవాణా చేస్తామని టిప్పర్ల యజమానులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాకు సిద్ధమయ్యారు.

మా వీధికి రోడ్డు వేయండి

» కుంటలా కన్పిస్తున్న దారి

» వానొస్తే ఇబ్బందులే

మార్కాపురం రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాలలోని చిన్న చిన్న వీధుల్లో కూడా ప్రభుత్వం సీసీ రోడ్డును నిర్మించింది.





రోడ్డుపై నిలిచి ఉన్న నీటిలో నడుస్తున్న స్థానికులు

బోడపాడులో కుంటను తలపిస్తున్న రోడ్డు

అయితే మండంలంలోని బోడపాడు గ్రామంలోని ఇళ్ల మధ్య రోడ్డుపై వర్షపు నీరు నిలిచి పోవడంతో ఆరోడ్డు నీటి కుంటను తలపిస్తోంది. ఆ రోడ్డుపై చిన్న పిల్లలు, వృద్ధులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఆ రోడ్డు గ్రామంలోని సెంటర్‌లలో ఉంటుంది. గ్రామ శివారు ప్రాంతం కూడా కాదు. ఎవరైనా కిరాణా దుకాణానికీ ఇతర అవసరాలకు ఆ రోడ్డుపైకి రావల్సిందే. అలాంటి ప్రధాన రోడ్డుపై నీరు నిలిచి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని అన్ని వీధులకూ సీసీ రోడ్డు ఉన్నా మా వీధికి లేదని వాపోతున్నారు. నీరు నిలిచి ఉండడంతో అనారోగ్య సమస్యలు కూడా వస్తున్నాయని చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సీసీ రోడ్డును వేయాలని స్థానికులు కోరుతున్నారు.

తాళం వేస్తే ఇల్లు గుల్లే..!

» నాడు ఊరెళ్తే.. దోచేసేవారు

» నేడు ఇంటికి తాళం వేసి పక్కవీధికి వెళ్లినా చోరీలు

» భయపడుతున్న ప్రజలు

కంభం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నాడు దసరా, సంక్రాంతి, ఇతర సెలవు రోజుల్లో ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళితే.. తిరిగి వచ్చే సరికి ఇల్లు గుల్ల అయ్యేది. పండుగల వేళల్లో ఇంటికి తాళాలు వేసి కనిపిస్తే దొంగల కన్ను పడి కన్నం వేసేవారు. నేడు ఇంటికి తాళం వేసి పక్క వీధిలోకి వెళ్లి వచ్చేసరికే దొంగతనం చేస్తున్నారని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. విహారయాత్రలకు, తీర్థయాత్రలకు, సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవలసిందేనని పోలీసులు హెచ్చరించేవారు. లేకుంటే భారీ మూల్యం తప్పదని చెప్పేవారు. ఇక దొంగతనాలు రాత్రి వేళ కాదు, పట్టగలే జరుగుతున్నాయి. వీధిలో అందరూ తిరుగుతుండగానే దొంగలు తమ పని చక్కగా చేసుకుని ఉడాయిస్తున్నారు. వీధులలో అమర్చిన సీసీ కెమెరాలకు చిక్కకుండా ఖర్చీఫ్‌లు, టోపీలు పెట్టుకుని వచ్చి దర్జాగా దోచుకెళ్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇరుగుపొరుగు వారికి తెలియచేయాలని పోలీసులు సూచిస్తున్నారు. నగదు, బంగారు, ఇతర విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరచడం ఉత్తమమని సూచిస్తున్నారు. ఈమధ్య కాలంలో దొంగతనాలకు వచ్చేవారు ప్రాణాలు సైతం తీసేందుకు వెనుకాడడం లేదు. ఇంటి వద్ద వృద్ధులను ఉంచడం శ్రేయష్కరం కాదు. పండుగ వేళ మహిళలు ఒంటి మీద ఉన్న బంగారు ఆభరణాలను కూడా దోచుకెళుతున్నారు. ఈ సమస్యలకు చెక్‌పెట్టేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌ను పోలీసులు అందుబాటులోకి తీసుకువచ్చారు. దాని ద్వారా సులువుగా దొంగలను పట్టుకుని చోరీలను నియంత్రించవచ్చు.



ఈనెల 11న కంభంలో మాజీ సైనికుడి ఇంట్లో బీరువాను పగులగొట్టి ఆభరణాలు దోచుకెళ్లిన దొంగలు

పురోగతిలేని దొంగతనాల కేసులు

కాగా ఇటీవల కంభంలో జరిగిన వరుస దొంగతనాల కేసులను ఛేదించేందుకు పోలీసులు, క్లూస్ టీంవారు దొంగతనం జరిగిన గృహాలలో దొంగల వేలిముద్రలు, చుట్టుపక్కల సీసీ కెమెరాలలో దొంగలు తిరిగిన ఫొటోలను సేకరిస్తున్నారు. ఇంతవరకు ఆ దొంగలను పట్టుకోవడం గానీ, పోయిన బంగారం, నగదు రికవరీ చేయడంలో విఫలమవు తున్నారని ప్రజలు అంటున్నారు. ఈనెల 11వ తేదీన పట్టణంలో పట్టపగలే ఇద్దరు మాజీ సైనికుల గృహాలలో దొంగలు పడి బంగారు, నగదును దోచుకెళ్లారు. సీసీ కెమెరాలలో దొంగలను గుర్తించారు. నేటికీ పురోగతిలేదు. తాజాగా ఈనెల 24న మద్దూరు పుల్లయ్య ఇంట్లో పట్టపగలే 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదును దొంగిలించారు. పోలీసులు యధావిధిగా క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. ఏదిఏమైనా ఇంటికి తాళం వేసి బజారుకు వెళితే ఎక్కడ దొంగలు పడతారేమోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాగ్రత్తతోనే చోరీలకు అడ్డుకట్ట
- నరసింహారావు, ఎస్ఐ



పండుగ సెలవులకు, ఇతర అవసరాలకు ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే చోరీలకు అడ్డుకట్ట వేయవచ్చు. ఊరు వెళ్తున్నట్లు ముందస్తుగా పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. దానివల్ల ఆ వీధిలో గస్తీ ఏర్పాటు చేస్తాం. ముఖ్యంగా ఇంటిలో ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) పరికరాన్ని ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల ఇంట్లో దొంగలు చోరీకి ప్రయత్నిస్తే ఆ పరికరం ద్వారా పోలీసులు అలెర్టు అవుతారు. మొబైల్ యాప్ అందుబాటులో ఉంటుంది. యాప్ యూజర్, కమాండ్ కంట్రోల్ రూం పోలీసులకు అనుసంధానంగా పనిచేస్తుంది. ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఎవరైనా సంచరించినా, తాళాలు పగులగొట్టినా వెంటనే ఆ పరికరం అలారం మోగుతుంది. యూజర్‌కు సిగ్నల్ రావడంతో పోలీసులు అప్రమత్తం అవుతారు. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలి. ఇరుగుపొరుగు వారికి ఎక్కడికి వెళ్తున్నదీ, ఎప్పుడు వచ్చేది సమాచారం ఇవ్వాలి. ఇంటి ముందు లైటు వేసి ఉంచాలి.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పొదిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రూ.3లక్షల78వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి ఆదివారం ఉప్పలపాడులో పంపిణీ చేశారు. మండలంలోని అన్నవరం, ఏలూరు, ఉప్పలపాడు గ్రామాల్లో వివిధ వ్యాధులకు వైద్యం చేయించుకున్న రోగులకు సీఎం సహాయ నిధి సాయాన్ని ఆమె అందజేశారు. వైద్యం చేయించుకున్న ప్రతి ఒక్కరి కుటుంబాల్లో ఆనందం చూడటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దఎత్తున సీఎం సహాయ నిధి చెక్కులను మంజూరు చేస్తున్నట్లు వసంతలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు ఉలవా గోపి, పట్టణ అధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, ఏఎంసీ చైర్మన్ ఇమాంసాహెబ్, రైతు సంఘ నాయకులు యలమంద, టీఎన్ఎస్ఎఫ్ గౌస్, మండల కార్యదర్శి కాటూరి శ్రీను, వెంకట్రావు, అంజిరెడ్డి మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ప్రజల మన్ననలు పొందాలి

రాచర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసినా ప్రజల మనన్నలు పొందాలని బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వారణాసి గిరిధరశర్మ అన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మండలంలోని 36మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బీసీ భవన్‌లో ఆత్మీయ అభినందన వీడ్కోలు సభలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని దానిని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1 షేక్ మొయినుద్దీన్, యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్

బేస్తవారపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఆదివారం స్థానిక వాసవీ ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. ఈ ఎన్నిక శాశ్వత ధర్మకర్త బొంతల లక్ష్మణ్‌స్వామి గుప్తా ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షునిగా వాగిచర్ల మారుతి ప్రసాద్, యువజన సంఘం అధ్యక్షునిగా మిచ్చనగట్ల రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ స్వామి గుప్తా మాట్లాడుతూ అమరావతి రాజ ధాని ప్రాంతంలో పొట్టి శ్రీరాములు స్మూప వనానికి 80 సెంట్ల భూమి కేటాయించడంపై మండల ఆర్యవైశ్య సంఘం అభినందించింది.

కలాంకు నివాళి

కంభం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ సభ్యులు, నాన్ లయన్ మెంబర్లు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల చైర్మన్ జాకీర్ హుస్సేన్, మాజీ జోన్ చైర్మన్ పులి శ్రీనివాస ప్రసాద్ రక్షణ రంగంలో కలాం సేవలను కొనియాడారు.

నెలాఖరులోగా ప్రీమియం చెల్లించాలి

గిద్దలూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకున్న పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులు స్వతహాగా బీమా ప్రీమియం వాటాను చెల్లించాలని వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. నెలాఖరులోగా కంది, సజ్జ, మినుము, నువ్వు, ఎండుమిరప పంటలకు బీమా చెల్లించాలని పేర్కొన్నారు. కందికి రూ.430 సజ్జకు రూ.156, మినుములకు రూ.205, నువ్వుపంటకు రూ.180, ఎండుమిరపకు ఎకరాకు రూ.4500 ప్రీమియాన్ని చెల్లించి బీమా చేసుకోవచ్చని తెలిపారు. వరి పంటకు మాత్రం ఆగస్టు 15 వరకు గడువు ఉందని, ఎకరాకు రూ.860 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. మీ సేవ, సీఎస్సీ సెంటర్, బ్యాంక్‌ల వద్దకు వెళ్లి పంటల బీమా నమోదు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

లింగారెడ్డి కాలనీ వద్ద మృతదేహం

తర్లుపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీ లింగారెడ్డి కాలనీ సమీపంలో చిట్టడివిలో మృతదేహాన్ని ఆదివారం గ్రామస్థులు గుర్తించారు. ఈ విషయాన్ని ఏఎస్ఐ నాగలక్ష్మికి గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో వెంటనే మృతదేహం వద్దకు వెళ్లి పరిశీలించారు. మూడు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని పోలీసులు నిర్ధారించారు. మండలంలోని రాగసముద్రం గ్రామానికి చెందిన పి.విష్ణు (28)గా పోలీసులు గుర్తించారు. విష్ణుది హత్యా లేక ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పోస్టుమార్టంకు మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు.

రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ సత్యరాజు మృతి

పొదిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పొదిలి ఏబీఎం పాఠశాలలో రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన సత్యరాజు(68) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. స్కూల్ అసిస్టెంట్‌గా సత్యరాజు నిబద్ధతతో పనిచేశారని విశ్రాంత తహసీల్దార్ వసంత కుమార్ అన్నారు. డీఎల్‌పీవో గొంగటి నాగేశ్వరరావు, జరుగుమల్లి ఎంఈవో నీలం నాగేందర్, కొనకనమిట్ల ఏపీటీఎఫ్ నాయకులు రామారావు, కోటేశ్వరరావు, జేవీవీ నేత కొండయ్య, బాలనరసయ్య, దర్జీల సంఘం చిన్న మృతదేహానికి నివాళులర్పించారు.

మార్కాపురం హెచ్‌ఎంకు నోటీసులు

మధ్యాహ్న భోజనంలో అవకతవకలపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం

ఒంగోలు విద్య, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలులో చోటు చేసుకున్న అవకతవకలపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయిని శ్రీదేవికి పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనం కోసం ప్రతి విద్యార్థికి రోజుకు 150 గ్రాముల బియ్యం ఇవ్వాలి. అయితే హెచ్‌ఎం కుకింగ్ ఏజెన్సీకి తగ్గించి ఇవ్వడం ద్వారా నిబంధనలను ఉల్లంఘించారు. పాఠశాలలో వెయ్యిమంది విద్యార్థినులు ఉండగా రోజుకు కేవలం 400నుంచి 500 గుడ్లు మాత్రమే ఇచ్చారు. బియ్యం, గుడ్లు మార్కెట్లో విక్రయించి ఆ మొత్తాలను తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయడం ద్వారా అక్రమాలకు పాల్పడ్డారని అభియోగపత్రం ఇచ్చారు. దీనిపై పది రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వాలని ఆర్‌జేడీ నోటీసుల్లో ఆదేశించారు.

సుపరిపాలన అందించడమే ధ్యేయం

దిగువమెట్ట తాండా, కేఎస్‌పల్లెలో తొలిఅడుగులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. ఆదివారం గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట తాండా, కేఎస్‌పల్లె గ్రామాలలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొని ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి కరపత్రాలను అందచేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను ప్రజలు తెలియచేయగా వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామసభలో ఆయన మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు చెప్పి గతంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని దివాలా తీయించారని ధ్వజమెత్తారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ బాలాజీనాయక్, మాజీ సర్పంచ్ బొడ్డు రంగారావు, బూత్ ఇన్‌చార్జి శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.



తిరుమలగిరికాలనీలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

టీడీపీతోనే గిరిజనుల అభివృద్ధి
ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం : గిరిజనుల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం పంచాయతీలోని తిరుమలగిరికాలనీలో ఆదివారం సాయంత్రం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో వైసీపీ విఫలం

» అధ్వానంగా పెద్దారవీడు-దేవరాజుగట్టు రోడ్డు

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పెద్దారవీడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో రోడ్డు నిర్మాణంలో వైఫల్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మం డల కేంద్రమైన పెద్దారవీడు నుంచి 565 జాతీయ రహదారికి అనుసంధానించేందుకు నిర్మాణం చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే ఆపివేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు కాకపోవడమే ఇందుకు కారణం.

బిల్లులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం

వెనుదిరిగిన కాంట్రాక్టర్

మండల కేంద్రమైన పెద్దారవీడు నుంచి దేవరాజుగట్టు వరకూ 4 కిలో మీటర్ల మేర రాష్ట్రీయ రహదారి ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దారవీడు నుంచి దేవరాజుగట్టు వద్ద ఉన్న 565 జాతీయ రహదారికి అనుసంధానంగా రోడ్డు విస్తరణ పనులకు టెండర్లు పిలిచారు. చిత్తూరు జిల్లాకు చెందిన కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. కొంతమేర పనులు చేసి పనులు నిలిపివేశాడు. అప్పుడు ప్రభుత్వం కొంతమేర నిధులను మంజూరు చేసింది. తిరిగి కాంట్రాక్టర్ పనులను ప్రారంభించాడు. మళ్లీ వైసీపీ నిధులను మంజూరు చేయలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయడంలో నిరాసక్తతతో వెనుదిరిగి మూటాముళ్లు సర్దుకొని పలాయనం చిత్తగించారు.

నాలుగు కిలోమీటర్లు నరకయాతన

పెద్దారవీడు నుంచి దేవరాజుగట్టుకు నాలుగు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ నాలుగు కిలోమీటర్ల దూరానికి వాహనదారులు తమ తమ వాహనాలలో వెళ్లాలంటే నరకయాతనకు గురౌతున్నారు. పెద్దారవీడు తహసీల్దార్ కార్యాలయం వద్ద, కొత్తపల్లి చెరువు వద్ద, దేవరాజుగట్టు పాఠశాల వద్ద, దేవరాజుగట్టు నుంచి శివాపురం వెళ్లే రహదారివద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో శ్రీశైలం, కర్నూలు, దోర్నాలకు వెళ్లే వాహనదారులు రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు కనపడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది కార్లలో వెళ్లే వాహనదారులు గుంతలకు వారి వాహనాల టైర్లు పగిలి తీవ్ర నరకం చూస్తున్నారు.



దేవరాజుగట్టు పాఠశాల వద్ద మధ్యలో కోసుకుపోయిన రోడ్డు



దేవరాజుగట్టు నుంచి శివాపురం వెళ్లే రోడ్డు వద్ద గుంతలు



కొత్తపల్లి చెరువు వద్ద గుంతలమయమైన రోడ్డు

పోలేరమ్మకు ఆదివారం జాతర



మార్కాపురం వన్‌టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లుకట్టి మొక్కులు తీర్చుకున్నారు.



పూర్వ విద్యార్థులతో పాల్గొన్న విశ్రాంత అధ్యాపకులు

ఘనంగా జీజే కాలేజీ గోల్డెన్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

» ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

» నాటి అధ్యాపకులకు ఘన సన్మానం

ఎర్రగొండపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆదివారం గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. 1976 నుంచి 1982 వరకు ఇంటర్ చదువుకున్న పూర్వపు విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. 1976లో కాలేజీ స్థాపించి మొదట పనిచేసిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. 1976-78-1980-82లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్, గాంధీ, వేగినాటి కోటయ్య విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కాలేజీ స్థాపించినప్పుడు పనిచేసిన అధ్యాపకులు సుబ్బారెడ్డి, నాగభూషణం, బాబూరావు, జయచంద్రరావు, వెంకటస్వామి, కవి దేవులపల్లి విశ్వనాథాన్ని దుశ్శాలవాలు వేసి, పూలందండలతో సన్మానించారు. అలాగే సమితి మాజీ అధ్యక్షుడు స్వర్గీయ వేగినాటి కోటయ్య సతీమణి వేగినాటి కాశమ్మను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఐఆర్ఎస్ నర్సమ్మ, విశ్రాంత జైలర్ షెఫీ ఉర్ రహిమాన్, ఎస్ ఫౌండేషన్ ఫౌండర్ ఎంఏ బేగ్ పాల్గొన్నారు. సభకు ఎస్ఎండీ కాశిం అధ్యక్షత వహించగా, పూర్వపు విద్యార్థులు యక్కలి భాగ్యరావు, జ్యోతి ప్రసాదరావు, జార్జి, సూరే వెంకటస్వామి, తుమ్మలపల్లి సుబ్బారావు, యక్కలి శివ, షేక్ బాషా కృషి చేశారు.

180 మందికి వైద్య పరీక్షలు

ఎర్రగొండపాలెం రూరల్, జులై 27 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతమైన పాలుట్ల గిరిజన గూడెంలో శని, ఆదివారాల్లో వైద్యశాఖ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు కే వెంకటేశ్వరనాయక్ తెలిపారు. గూడెంలోని ప్రజలకు ప్రస్తుత రోగాలపై అవగాహన కల్పించారు. ఆనంతరం గ్రామంలోని రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులను పంపిణి చేశారు. అలాగే సుమారు 20 మంది గర్భిణులకు వ్యాక్సిన్‌లు వేశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ జానా రెడ్డి, ఏఎన్ఎం మాధవి, ఆశోక్ , కొండయ్య, వెంకట రామయ్య సేవలందించారు.

డాక్టర్ బ్రహ్మంకు ఎమ్మెల్యే నివాళి

గిద్దలూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సుపరిచితులైన డాక్టర్ జీవీ బ్రహ్మం (75) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి తెలిపారు.

బాలకొండారెడ్డికి నివాళి

బయనపల్లె గ్రామానికి చెందిన గంట బాలకొండారెడ్డి మృతిచెందడంతో ఆదివారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి బయనపల్లె గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు.

రూ.10వేల ఆర్థిక సాయం అందజేత

అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో పట్టణంలోని పాములపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్త పెసరపాటి మహేష్ ఆచారి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సాయమందించారు. ఆయనతోపాటు కంభం మార్కెట్ యార్డు చైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, అర్ధవీడు మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి అంజనేయులు, టీడీపీ నాయకులు నంది శ్రీను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గిద్దలూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : అంబవరం 33కేవీ ఫీడర్‌లైన్ మెయింటినెన్స్ కారణంగా విద్యుత్ సరఫరా నిలపివేస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ముండ్లపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని ముండ్లపాడు, తాళ్లపల్లె, బురుజుపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని బురుజుపల్లె, కొత్తకోట, బురుజుపల్లె తాండా గ్రామాలలో ఈనెల 28వ తేదీ సోమవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య గృహ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ శేష గిరిరావు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

రాచర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని మాజీ ఎంపీపీ బీ గాలెయ్య అన్నారు. మండలంలోని జేపీచెరువు గ్రామంలో 60సంవత్సరాలు పైబడిన వృద్ధులందరూ స్థానిక ఆర్‌సీఎం చర్చిలో షష్టి అనుభవాలు పంచుకుంటూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గాలెయ్య మాట్లాడుతూ మొక్కలు నాటడం హర్షించదగ్గ విషయమని ప్రతిఒక్కరు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్ మహబూబ్ బాషా, స్థానికులు షేక్ మౌలాలి, సుభాని, చర్చి ఫాదర్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో గుంటిగంగ సన్నిధి సందడిగా మారింది.

ఈసందర్భంగా గంగమ్మ తల్లిని అధికసంఖ్యలో భక్తులు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. మరికొందరు కుంకుమ పూజలు చేశారు. పలువురు వాహనదారులు వాహన పూజలు చేయించారు. ఆలయ అర్చకపూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌పీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు..

ముండ్లమూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసి ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. ముండ్లమూరు, పోలారం, పసుపుగల్లు, పెదఉల్లగల్లు, పూరిమెట్ల, ఈదర, బొప్పూడివారిపాలెం, శంకరాపురం గ్రామాల్లో వేంచేసి ఉన్న పోలేరమ్మకు ప్రత్యేకం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు పోలేరమ్మకు ప్రత్యేక అలంకరణ చేశారు.

కంటి ఆపరేషన్లకు ప్రత్యేక వాహనాల్లో తరలింపు

కనిగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 19న కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి ఆపరేషన్‌లు అవసరమని వైద్యులు గుర్తించారు. ఈక్రమంలో తొలివిడతగా 96 మందిని ఆపరేషన్ల నిమిత్తం ఆదివారం గుంటూరు శంకర కంటి ఆసుపత్రికి ప్రత్యేక వాహనాల్లో తరలించారు.

కోటమ్మ మృతిపట్ల టీడీపీ నేతల సంతాపం

పామూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి మాతృమూర్తి కోటమ్మ అకాలమరణం బాధాకరమని ఆపార్టీ నాయకుడు యారవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కోటమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నివాళులర్పించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బి.నరసింహారావు, బి.జయరామిరెడ్డి, బి.నారాయణరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, సయ్యద్ అమీర్‌బాబు, తదితరులు ఉన్నారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 27(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని టీడీపీ నాయకుడు శ్రీనివాస వర్మ అన్నారు. ఆగస్టు 3న సీఎస్‌పురంలో జరిగే ఏపీటీఎఫ్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం సీఎస్‌పురం మండలం చింతపూడులో ఆయన ఆవిష్కరించారు.

కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, తోట శ్రీనివాసులు, డి.సుబ్బరాయుడు, బి.శ్రీనివాసులు, సీహెచ్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాల అమలులో ప్రభుత్వాలు వైఫల్యం

కనిగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాల అమలులో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన ఐద్వా పట్టణ నాల్గో మహాసభలో ఆమె మాట్లాడారు.

మహిళలపై తీవ్ర అణచివేత, హింస పెరిగిపోతుందన్నారు. మహిళలపై లైంగిక దౌర్జన్యం, గృహ హింసలు అధికమయ్యాయన్నారు. మహిళలకు భద్రత కల్పించేవిధంగా ప్రభుత్వం విధానాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. తొలుత ఐద్వా నాయకురాలు బి.ఆదిలక్ష్మి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రసన్న, రమణమ్మ, ఎలేసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- దుర్వాసనతో ప్రజల అగచాట్లు
- దొనకొండలో కానరాని స్వచ్ఛత
- పట్టించుకోని అధికారులు

దొనకొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): దొనకొండ గ్రామ పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. ప్రధానంగా అరబస్తాన్ వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇళ్లల్లోని మురుగునీరు, ఇతర వ్యర్థాలతో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు పాఠశాలల సమీపంలోకి, రోడ్డుమీదకు చేరటంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు పెరిగిపోయాయి. దీంతో ఎటువంటి వ్యాధులు ప్రభలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రతినెలా మూడవ శనివారం ఉద్యమంలా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే, దొనకొండలోని అరబస్తాన్ వీధిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద, మరికొన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దొనకొండలో పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు ప్రధాన మార్గాలు, ప్రధాన వీధుల్లో వ్యర్థాలను తొలగించటమే తప్పా ఇతర ప్రాంతాలవైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అరబస్తాన్ వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దొనకొండ అరబస్తాన్‌వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

రంగుమారిన ఎన్‌ఏపీ నీరు

ముండ్లమూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు దర్శి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి సరఫరా అయ్యే ఎన్‌ఏపీ నీరు గత కొన్ని రోజులుగా రంగుమారి వస్తుంది. దానికితోడు దుర్వాసన, చిన్నచిన్న తల కప్పలు కూడా వస్తుండటంతో వ్యాధుల బారిన పడతామేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అసలే మండలానికి వారం రోజులకు ఒకసారి తాగు నీరు సరఫరా అవుతుంది. అదికూడా పూర్తిగా రంగుమారి సరఫరా అవుతుంది. ఇటీవల కొన్ని గ్రామాల ప్రజలు ఆ నీటిని తాగటం వల్ల కొంత అనారోగ్యానికి గురయ్యారు. రంగుమారిన నీరు దుర్వాసనతో వస్తుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీరు అడుగంటి పోవటంతోపాటు దర్శి నుంచి ముండ్లమూరుకు వచ్చే పైపులైన్ శిథిలావస్థకు చేరింది. దీనికితోడు పైపులు పగిలి పోవటం వల్ల కలుషిత నీరు వస్తుందని తెలిపారు. కనీసం పగిలిచోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మండలంలోని పులిపాడు, రెడ్డినగర్, పసుపుగల్లు, ముండ్లమూరు, చింతలపూడి, వేములబండతో పాటు తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, ఈదర, వేములబండ గ్రామాలకు వారానికి ఒకసారి వచ్చే ఎన్‌ఏపీ నీరు రంగ మారి వస్తుంది. దీనికి తోడు మట్టితో కూడిన నీరు సరఫరా అవుతుంది. విధిలేని పరిస్థితిలో వడపోసుకొని వేడి చేసుకొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం బ్లీచింగ్ కలిపి సరఫరా చేయాలని కోరుతున్నారు.



ముండ్లమూరు: రంగుమారిన ఎన్‌ఏపీ నీరు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- 31 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కనిగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం 31 మందికి సీఎం సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను ఆయన అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికి పేద కుటుంబాల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక నిధి నుంచి నిధులు అందజేయడం గొప్ప విషయమన్నారు.

పేదల పట్ల చంద్రబాబుకు ఉన్న మానవత్వాన్ని నేడు కోట్లాది రూపాయల సీఎం సహాయనిధి పంపిణీ రుజువు చేస్తుందన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రులలో సరైన వైద్యం చేయించుకునే స్తోమత లేక ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారన్నారు. అలాంటి కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో భరోసాగా నిలిచిందన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

నిరుపయోగంగా చెత్తసంపద తయారీ కేంద్రాలు

- పట్టించుకోని పంచాయతీ పాలకులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

పామూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ఏర్పాటుచేసిన చెత్త సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో ప్రతి గ్రామ పంచాయతీలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. వీటిద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే, ఆ ఆశయం నెరవేరడం లేదు.

పారిశుధ్య నిర్వహణలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకం. గతంలో వీటి నిర్వహణ పూర్తిస్థాయిలో జరుగుతూ గ్రామాలు శుభ్రంగా ఉండేవి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీటి నిర్వహణను గాలికి వదిలేశారు. మండలంలో బుక్కాపురం, మార్కొండాపురం గ్రామాల్లో మినహా మిగిలిన 23 గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్మించారు. పామూరులో సువిశాల స్థలంలో నిర్మించిన ఈకేంద్రం రాష్ట్రంలోనే మోడల్ కేంద్రంగా గుర్తింపు పొందింది. పారిశుధ్య కార్మికుల ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్త రిక్షాల ద్వారా తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి కేంద్రంలో వేర్వేరుగా తొట్లలో కుళ్లబెడతారు. ఇందులో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను యంత్రాలతో పిండి చేస్తారు. ఈ పిండిని సీసీ, తారు రోడ్ల నిర్మాణాల్లో ఉపయోగిస్తారు. చెత్తను సేంద్రియ ఎరువుగా తయారుచేసి ఆయా గ్రామాల్లోని రైతులకు విక్రయిస్తారు.

అయితే, చెత్తను ఎరువుగా మార్చేందుకు అయ్యే ఖర్చు అధికంగా ఉందని పంచాయతి అధికారులు తెలుపుతున్నారు. పామూరు, వగ్గంపల్లి, కంభాలదిన్నె, రావిగుంటపల్లి, దూబగుంట, ఇనిమెర్ల గ్రామాల్లో తప్ప మరెక్కడా చెత్త కేంద్రాలు వినియోగంలో లేక నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాలకు దూరంగా నిర్మించడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయని ఆయా గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పడమటకట్టకిందపల్లి గ్రామంలో వైసీపీ హయాంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్త కేంద్రంలోని తొట్లను ధ్వంసం చేశారు. నర్రమారెల్ల గ్రామంలో షెడ్డుకు ఉన్న రేకులను ఎత్తుకెళ్లారు. మరికొన్ని కేంద్రాల్లో సక్రమంగా నిర్వహణ లేకపోవడంతో చిల్ల చెట్లు మొలచిఉన్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సంకల్పించింది. ఇందుకోసం పామూరులో నియోజకవర్గస్థాయిలో రోజుకు ఒక మండలం చొప్పున కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ ఇచ్చారు. చెత్త సంపద కేంద్రాలను పంచాయతీ ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాలని అవగాహన కల్పించారు. అయితే, ఈ కేంద్రాలు ఇంకా వినియోగంలోకి రాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈకేంద్రాలను వాడుకలోకి తీసుకొచ్చి ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.



కోడిగుంపలలో నిరుపయోగంగా ఉన్న చెత్తసంపద కేంద్రం



కట్టకిందపల్లిలో ధ్వంసమైన తొట్లు

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే!

- ఎల్.బ్రహ్మయ్య, ఎంపీడీవో



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ గ్రామ పంచాయతీలదే. ప్రభుత్వ నిబంధనల మేరకు చెత్త సేకరణ జరగటం లేదు. పలు పంచాయతీల్లో పాక్షికంగా చెత్త సేకరణ జరుగుతుంది. అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్తసేకరణ జరిగేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

- ఎన్జీవో నేత పీవీ రమణారెడ్డి డిమాండ్

కనిగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఏపీఎన్జీవో సంఘం తాలూకా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో భవనంలో జరిగిన సంఘ తాలూకా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డీఏలు మంజూరు చేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు, జీపీఎఫ్ మొత్తాలు, సరెండర్ లీవ్‌లు, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సక్రమంగా ప్రీమియం కడుతున్నప్పటికీ హెల్త్‌కార్డులు పనిచేయటం లేదన్నారు. నగదు రహిత వైద్య సదుపాయాలు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశానికి వచ్చిన ఉద్యోగులకు మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా జనపనార బ్యాగులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వోద్యోగులు బాధ్యత వహించి ప్లాస్టిక్ వాడకాన్ని నివారించే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు.

సమావేశంలో సంఘ నాయకులు జక్రయ్య, హజరత్‌ఆలీ, రహమత్ బాషా, బత్తుల మల్లికార్జున, బి.వెంకటసుబ్బయ్య, కిరణ్, నాసర్‌వలి, రామలింగారెడ్డి, మస్తాన్, కిరణ్‌కుమార్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు జనపనార బ్యాగులు పంపిణీ చేసిన కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

రేపు పీసీపల్లి మండల సమావేశం

పీసీపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ అత్యాల జనన్య అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల సమీక్షతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు. అలాగే శాశ్వత ఆహ్వానితులు కూడా హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

కనిగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి కలాం చేసిన సేవలను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, అహ్మద్, గుడిపాటి ఖాదర్, తాతపూడి స్టాలిన్(బుజ్జి), కేవీఎస్ గౌడ్, నజిముద్దీన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అలాగే, జనసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాసవీసత్ర సముదాయాల చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మస్తాన్‌బాషా, దేవకి శ్రీనివాసులు, అంజినాయుడు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను పారదోలాలి



మాట్లాడుతున్న డాక్టర్ చెన్నకృష్ణ

పామూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): దేశంలో మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ టి.చెన్నకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగిన జేవీవీ పామూరు, సీఎస్‌పురం మండలాల మహాసభకు షేక్ అబ్దుల్ అధ్యక్షత వహించారు. డాక్టర్ చెన్నకృష్ణ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మూఢ నమ్మకాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధునిక కాలంలో ప్రజల్లో పెరుగుతున్న మూఢచారాలు నివారించి శాస్త్రీయ ఆలోచనలు పెరిగే విధంగా ప్రజలను చైతన్యులు చేసేందుకు జేవీవీ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. వి.మాలకొండారెడ్డి, మాట్లాడుతూ పిల్లల్లో శాస్త్రీయ ఆలోచన విధా నాలు పెంపొందించాలన్నారు. ఆగస్టు 9, 10 తేదీల్లో గిద్దలూరులో జరగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీ ఎఫ్ నాయకులు పేట తిరుపతిరెడ్డి, వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, మండల కార్య దర్శి కె.శంకర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీలను ఎ న్నుకున్నారు. పామూరు మండల అధ్యక్షుడిగా జి.సురేంద్ర, కార్యదర్శిగా కె.నా గిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ శంకర్, శైలజ దేవరాజును ఎన్నుకున్నా రు. సీఎస్‌పురం మండల అధ్యక్షుడిగా షేక్ గౌస్‌బాషా, గౌరవాధ్యక్షుడిగా పీఎం రసూల్, ప్రధాన కార్యదర్శిగా జె. వెంకటరావును ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 27(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కుబడి భక్తులు మేళతాళాలతో మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామివారికి సమర్పించారు.

అనంతరం గోశాలలోని గోవులకు పసుపు కుంకు మాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్న ఆదినారాయణ, బోయిళ్ల నారాయణరెడ్డి, వరికూటి హనుమంతరావు, తోట రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



సీఎస్‌పురంలో కరపత్రాలు పంపిణీచేస్తున్న టీడీపీ శ్రేణులు

సీఎస్‌పురం(పామూరు), జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన సీఎస్‌పురం లో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అం దిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.నారాయణరెడ్డి, షేక్ రజ్జబ్ బాషా, మన్నేపల్లి రవి, దాసరి మల్లికార్జున, ఆదినారాయణ, రేనాటి వెంకటేశ్వర్లు, తదితరులు పా ల్గొన్నారు.

అలాగే, పామూరు పట్టణంలోని 281 బూత్‌లో జరిగిన కార్యక్రమంలో సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జ్ ఉప్పలపాటి హరిబాబు, బండ్ల నారాయణ, బూత్ నెంబర్ 271, 269లో జరిగిన కార్యక్రమంలో ఆర్ఆర్ రఫి, ముబినా మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జిల్లావాసి మృతి



మృతిచెందిన రామిరెడ్డి

పరవాడ (అనకాపల్లి జిల్లా), జూలై 27 (ఆంధ్రజ్యోతి): పరవాడ- లంకెలపాలెం ప్రధాన రహదారిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తి మృతిచెందాడు. స్థానిక సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలమేరకు.. హెచ్‌ఎంపాడు మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన కొండపురెడ్డి రామిరెడ్డి (39) పరవాడ ఫార్మాసిటీలోని రాంకీకి చెందిన కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ (సీడబ్ల్యూఎంపీ)లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలిసి విశాఖ నగరంలోని కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం సాయంత్రం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఫార్మా సిటీలోని లారస్ ల్యాబ్స్ ఫార్మా పరిశ్రమ సమీపంలోకి వెళ్లేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి కిందపడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతుడి వివరాలు సేకరించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



రేపు తెరుచుకోనున్న
సాగర్ గేట్లు



నాగార్జున సాగర్ జలాశయంకు జలకళ

584 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

584 అడుగులకు చేరిన నీటి మట్టం

పులిచింతలకు నీటి విడుదలకు ఏర్పాట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ జలాశయానికి వరద భారీగా వచ్చి చేరుతోంది. జలకళతో సాగర్ నిండుకుండలా దర్శనిమి స్తోంది. నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో సాగర్ క్రస్టు గేట్లు ఎత్తి పులిచింతలకు నీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయం తీసుకు న్నారు. ఇందుకు సంబంధించిన ముహూర్తాన్ని ఖరారు చేసి ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీరు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్‌ఈ మల్లికార్జునరావు ఆదివారం ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

18 ఏళ్ల తర్వాత జూలైలో..

సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాగర్ గేట్లను తెరుస్తారు. 2007లో జూలై నెలలో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత అంటే 18 ఏళ్లకు మళ్లీ జూలైలో గేట్లు ఎత్తడం ఇప్పుడే. గత ఏడాది ఆగస్టు 5న క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు.

పోటెత్తుతోన్న వరద..

ఆల్మట్టి నుంచి శ్రీశైలం దాకా అన్ని ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. అన్ని జలాశయాలు నిండాయి. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం డ్యాంకు వరద పోటెత్తుతోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1.20 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. డ్యాం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా ఆదివారం 584 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకు 291 టీఎంసీలకు చేరింది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతలకు 28,826 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శనగ అధరగా

పెరిగిన తెల్ల, ఎర్ర శనగ ధరలు



ధర పెరగడంతో అమ్ముకునేందుకు సిద్ధం అవుతున్న రైతులు



పర్చూరులోని ఓ కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన శనగలు

శనగ రైతుల నిరీక్షణ ఫలించింది. మూడు నెలల నుంచి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న పంట బయ టకు తీసే సమయం ఆసన్నమైంది. శనగ ధరల్లో ఆశాజనక వృద్ధి కనిపించడం.. అది కూడా సరిగ్గా ఖరీఫ్ పెట్టుబడుల ముందు కావడంతో రైతులకు ఊరట దక్కినట్లయింది. ప్రభుత్వం బర్లీ పొగాకు సాగు చేయవద్దని చెప్పడంతో.. ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న కర్షకులను మార్కెట్‌లోని ధరలు శనగ వైపు అరకలెత్తేలా చేశాయి.

- మూడు నెలల నుంచి కోల్డ్ స్టోరీజీల్లోనే పంట
- ఖరీఫ్ పెట్టుబడుల వేళ రైతులకు ఊరట
- బర్లీకి ప్రత్యామ్నాయంగా సాగుకు మొగ్గు

(బాపట్ల, పర్చూరు-ఆంధ్రజ్యోతి): బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో శనగ దిగుబడులు దాదాపు 48 వేల టన్నుల వరకు ఉంటాయనేది ఓ అంచనా. ఇందులో 50 శాతం దిగుబడుల సమయంలోనే బహిరంగ మార్కెట్‌కు తరలిపోగా మిగిలిన 50 శాతం పంటను రైతులు నిల్వ చేసుకున్నారు. ఇప్పుడు ధర పెరగడంతో వారిలో సంతోషం వ్యక్తమవుతోంది

బాపట్ల జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజక వర్గాల్లో శనగ అధికంగా సాగవుతూ ఉంటుంది. రబీ సీజన్‌లో దాదాపు జిల్లాలో 13 వేల హెక్టార్లలో శనగ సాగయ్యిందనేది వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇక పల్నాడు జిల్లాలో 3,800 హెక్టార్లు, గుంటూరు జిల్లాలో 2,200 హెక్టార్లలో శనగ సాగు జరిగిందనేది అంచనా. గత రబీని మినహాయిస్తే అంతకు ముందు మూడు జిల్లాల పరిధిలో శనగ సాగు దాదాపు 30 వేల హెక్టార్ల వరకు ఉండేది. అది ఇప్పుడు (మిగతా 6లో)

దశాబ్దం తర్వాత

గడచిన పదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా కాక్ -11 (తెల్ల) శనగల రకం కన్నా, జేజే -11 (ఎర్ర) శనగల ధర కాస్త అధికంగా ఉండటం గమనార్హం. వారం క్రితం వరకు క్వింటా రూ.5,700 ఉన్న ఎర్ర శనగలు ప్రస్తుతం క్వింటా రూ.6,300 పెరిగింది. ఇది మరింత పైకి ఎగబాకే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెల్ల శనగలు మాత్రం క్వింటా రూ. 6000 నుంచి రూ.6,200 లకు చేరింది. దశాబ్దం క్రితం ఒకసారి కాక్ -11 కన్నా జేజే -11 ధర అధికంగా పెరిగింది. ఎర్ర శనగలతో పోలిస్తే దిగుబడుల విషయంలో తెల్లశనగలు వెనకబడే ఉంటాయి. కానీ, ధర ఆశాజనకంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు తెల్ల శనగ సాగు వైపే మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.

పదవులు పొందారు ప్రమాణం మరిచారు

రేపల్లె, కూచినపూడి ఏఎంసీల చైర్‌పర్సన్ల నియామకం



రేపల్లె మార్కెట్ యార్డు

- మూడు నెలలు దాటినా బాధ్యతలు చేపట్టని వైనం
- యార్డుల్లో ఎక్కడ సమస్యలు అక్కడే

రేపల్లె, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏప్రిల్ 4న రేపల్లె,కూచినపూడి అగ్రి కల్చరల్ మార్కెట్ కమిటీలకు (ఏఎంసీ) చైర్మన్లను, డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, నేటికీ చైర్మన్లు ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టలేదు. దీంతో రైతులకు అందాల్సిన సేవలు, వారి సమస్యల పరిష్కారంలో మరింత జాప్యం ఏర్పడుతోంది. రేపల్లె మార్కెట్ యార్డు చైర్మన్‌గా జనసేనకు చెందిన మత్తి అనురాధ, కూచినపూడి మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఓగిబోయిన వెంకట్‌యాదవ్‌ను, డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. యార్డుల పరిధిలోని గోదాముల అభివృద్ధిలో చైర్మన్ల పాత్రే కీలకం.

అధ్వానంగా రేపల్లె గోదాములు

రేపల్లె మార్కెట్ యార్డులో రెండు దశాబ్దాల కిందట నిర్మించిన గోదాముల పైకప్పు రేకులకు పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. నిల్వ ఉంచిన ధాన్యం వర్షపు నీటికి తడిచిపోతోంది. ఈ గోదాములకు గత ప్రభుత్వంలో కనీసం మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి సమీపంలోని గోదాంలో రేపల్లె యార్డుకు సంబంధించిన ధాన్యం నిల్వ ఉంది. ఈ భవనానికి కూడా మరమ్మతులు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పూర్తయ్యే నాటికి గోడౌన్‌ల మరమ్మతులు నిర్వహించి, ధాన్యం నిల్వ చేసుకునేందుకు సిద్ధం చేయాలని రైతులు కోరుతున్నారు. ఇవన్నీ జరగాలంటే.. చైర్మన్లు ముందుగా ప్రమాణస్వీకారం చేసి, వాటిపై దృష్టి సారించాల్సి ఉంది.

● అద్దె భవనంలో కూచినపూడి మార్కెట్ యార్డు

కూచినపూడి మార్కెట్ యార్డు అభివృద్ధిని పాలక యంత్రాం గం పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి యార్డు అద్దె భవనాల్లోనే కొనసాగుతోంది.



నిజాంపట్నంలో అద్దెభవనంలో కొనసాగుతున్న కూచినపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు

కూచిన పూడి నియోజకవర్గం రద్దు కాకముందు.. ఇక్కడ మార్కెట్ యార్డును అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి, మంత్రులు కాసు కృష్ణారెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, మోపిదేవి వెంకట రమణరావు యార్డును ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కూచినపూడి యార్డు కార్యాలయాన్ని నిజాంపట్నం తరలించారు. ప్రస్తుతం అక్కడ కూడా అద్దె భవనంలోనే కార్యాలయం కొనసాగుతోంది. దీనికి ఒక గోదాము కూడా లేదు. దీంతో రైతులు పంటను ఎక్కడ దాచుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. చెక్‌పోస్టుల ద్వారా మార్కెట్ యార్డుకు రూ.2 కోట్ల మేర ఆదాయం వస్తోంది. అయితే యార్డుకు స్థల సేకరణ చేసి, గోదాము నిర్మిద్దా మన్న ఆలోచన కూడా గత ప్రభుత్వానికి రాలేదు. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా అనగాని సత్యప్రసాద్ పల్లప ట్ల సమితి భవనాన్ని మార్కెట్ యార్డుగా ఏర్పాటు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. కానీ, ఫలించ లేదు. అప్పటి నుంచి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పరిస్థితి మారింది.

పది నెలల్లో రూ.300 కోట్లకుపైగా
దోపిడీ?

- మద్యం విక్రయాల్లో రాబడి తేడాలతో అంచనా
- గత వైసీపీ హయాంలో నాసిరకంలోనూ పిండేశారు
- ప్రస్తుతం కోరుకున్న మద్యం ఉన్నా తగ్గిన ఆదాయం

గుంటూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఊరూ పేరులేని అనామక జే బ్రాండ్లతో వైసీపీ హయాంలో మందుబాబుల ఆరోగ్యం ఒళ్లుగుల్లకాగా, జేబులకు చిల్లుపడింది. పైగా నాసిరకం మందు అమ్మి యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. 2023 సెప్టెంబరు నుంచి 2024 జూన్ వరకు వైసీపీ హయాంలో, 2024 సెప్టెంబరు నుంచి 2025 జూన్ వరకు కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో



జగన్ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణం

జరిగిన మద్యం విక్రయాల ఆదాయం చూస్తే జే బ్రాండ్లతో రూ.300 కోట్లకు పైగా దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. నాసిరకం బ్రాందీ, విస్కీ, బీర్లకు వాస్తవ ధరకంటే అధిక ధర నిర్ణయించిన వైసీపీ పాలకులు మందుబాబుల నుంచి దోచుకున్న సొమ్మును సొంత ఖజానాకు చేరవేసుకున్నారని తెలుస్తోంది. సీఎంగా జగన్ ప్రవేశ పెట్టిన ప్రభుత్వ మద్యం దుకాణాల వ్యవస్థను చంద్రబాబు రద్దు చేసిన విషయం తెలిసిందే. పైగా గతంలో వలే కాకుండా ఇప్పుడు కోరుకున్న మద్యం బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చారు. అయితే ఈ నిర్ణయం వల్ల మద్యం వ్యాపారం పెరిగిందే కానీ ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీ, కూటమి హయాంలో పది నెలల వ్యవధిలో నాడు, నేడు జరిగిన అమ్మకాలను పోల్చి చూస్తే జగన్ హయాంలో అమ్మింది నాసిరకం మద్యమైనా ఎన్ని కోట్ల దోపిడీ జరిగిందో వెల్లడవుతున్నది. జగన్ హయాంలో 2023 సెప్టెంబరు నుంచి 2024 జూన్ వరకు బ్రాందీ, విస్కీ వంటివి 20 లక్షల 14వేల 423 కేసుల అమ్మకాలు జరిగాయి. భూమ్ భూమ్ వంటి నాసిరకం బీర్లు 5 లక్షల 16వేల 927 కేసుల అమ్మకాలు జరిగాయి. వీటి ద్వారా అప్పటి ప్రభుత్వానికి రూ.1757.31 కోట్లు రాబడి వచ్చింది. అదే చంద్రబాబు హయాంలో 2024 సెప్టెంబరు 2025 జూన్ వరకు బ్రాందీ, విస్కీ వంటివి 23 లక్షల 25 వేల 908 కేసుల అమ్మకాలు జరిగాయి. కింగ్‌ఫిషర్ వంటి నాణ్యమైన బీర్లు 10 లక్షల 51 వేల 306 కేసుల అమ్మకాలు జరిగాయి. ఈ పది నెలల్లో అమ్మకాల్లో 20 శాతం వృద్ధి కనిపించినా వైసీపీ హయాంలో వచ్చినంత రాబడే ఖజానాకు వచ్చింది. వైసీపీ హయాంలోని ధరలతో పోల్చితే రూ2108.77 కోట్లు రావాలి. అయితే కూటమి ప్రభుత్వం ధరలు తగ్గించడంతో అది రూ.1796.93 కోట్లకే పరిమితమైంది. అంటే ఈ పది నెలల్లో జరిగిన లెక్కలు చూస్తే వైసీపీ హయాంలో నాసిరకం మద్యం అమ్మి సుమారు రూ.300 కోట్లు దోచుకున్నట్లు అర్థమవుతోంది. ఈ లెక్కన వైసీపీ హయాంలో ఐదేళ్ల అదనపు ధరలతో జరిగిన దోపిడీ ఎంతనేది చూస్తే ఎవరైనా అమ్మో అనాల్సిందే.

పోలీసుల అదుపులో
జంట హత్య నిందితులు

- ముంబై ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

నరసరావుపేట లీగల్, అద్దంకి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బెంగ ళూరు రియల్ వ్యాపారులైన తండ్రీ కొడుకులు వీరాస్వామిరెడ్డి, ప్రశాంత్ రెడ్డి హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ కేసులో కోర్టుకు హాజరయ్యేందుకు బెంగళూరు నుంచి నరసరావుపేటకు వచ్చిన తండ్రీ కుమారుల్ని ఈ నెల 23న కిడ్నాప్ చేసి సంతమాగులూరు మండలం పాతమాగులూరు సమీపంలో హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుల కోసం పోలీసు బృందాలు గాలింపు చేపట్టాయి. కిడ్నాప్ ఘటనను కొందరు న్యాయవాదులు వీడియోలు తీశారు. వాటిని పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుల కదలికలు ఎప్పటి కప్పుడు పోలీసులు అంచనా వేశారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఐదుగురు నిందితులు ముంబై ఎయిర్‌పోర్టులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెం టనే ఉన్నతాధికారులు రంగంలోకి దిగి హత్య కేసులో ప్రమేయం ఉన్న మొదటి నిందితుడి సహా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే కేసు ను నరసరావుపేట స్టేషన్‌కు బదిలీ చేసిన నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో నిందితులను అరెస్టు చూపి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



హంతకులు వినియోగించిన కారు

ఒకరికి రిమాండ్

ఈ కేసులో నిందితుడైన గడ్డం అనిల్‌రెడ్డిని ఆదివారం నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అతడ్ని మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. అనిల్‌రెడ్డికి ఆగస్టు 7 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఏ సలోమి ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై ముంబైలో అదుపులోకి తీసుకున్న పోలీసులు నరసరావుపేటకు తీసుకువస్తున్నట్లు సమాచారం.

ఉద్యోగులూ ఉపాధి కూలీలే

- మల్లాయపాలెంలో బోగస్ మస్టర్ల గుట్టురట్టు
- సామాజిక తనిఖీ సభలో అవకతవకల గుర్తింపు



మల్లాయపాలెంలో సామాజిక తనిఖీ గ్రామ సభలో ఉపాధి పనుల వివరాలను వెల్లడిస్తున్న తనిఖీ బృందాలు

బల్లికురవ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూలీల వలసల నిరోధానికి పెట్టిన ఉపాధి హామీ పథకం అక్రమాలకు నెలవుగా మారింది. సామాజిక తనిఖీల్లో మస్టర్ల మాయ, పనులు చేయకుండానే రికార్డులు, కూలీలు పనికి రాకుండానే చెల్లింపులు తదితర అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. అయితే మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో ఏకంగా ఉద్యోగులనే ఉపాధి కూలీలుగా చేర్చి నిధులు మాయం చేసినట్లు వెలుగుచూసింది. గ్రామంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ చేపట్టి ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. ప్రతి కూలి ఇంటికి వెళ్లి పనులకు వచ్చారా లేదా అని విచారణ చేశారు. ఈ క్రమంలో పనుల్లో పెద్దఎత్తున లోపాలు ఉన్నాయని అధికారుల తనిఖీల్లో గుర్తించారు. గతంలో చేసిన పనులకు రికార్డులు సరిగా లేకపోవడంతో తనిఖీలు చేసిన అధికారులు నిధులు దుర్వినియోగంపై నివేదికలను తయారు చేసి గ్రామసభ ముందు చదివి వినిపించారు. ఉపాధి నిధులు దుర్వినియోగం అయ్యాయని సభలో అధికారులు ప్రకటించారు. గ్రామంలో 61 మందికి అబ్బారెడ్డి బాలకృష్ణ బోగస్ మస్టర్లు వేశాడని, వారిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నట్లు చెప్పారు. అదేవిధంగా గ్రామంలో లేకుండా ఇతర ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు మస్టర్లు వేసి నిధులు కాజేశారని ప్రకటించారు. సభలో ఎస్‌ఆర్పీ తులసినాయక్, డీఆర్పీ అంజయ్య, ఉపాధి ఇన్‌చార్జి ఏపీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్
- చందలూరులో సుపరిపాలనలో తొలిఅడుగు
- ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ.. కళాక్షేత్రం ప్రారంభం

పంగులూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోన్నదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని చందలూరు గ్రామంలో ఆదివారం సుపరిపాలన - తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ కుళాయి ద్వారా నీరందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.57 లక్షలతో పైపులైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి, ఎంపీ ఆవిష్కరించారు., ఎన్టీఆర్ కళాక్షేత్రాన్ని ప్రారంభించారు.



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

ఎంఈఓ పోస్టుల భర్తీకి చర్యలు

- ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు(విద్య) జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎంఈఓ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పాఠశాల విద్య సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) లింగేశ్వర రెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన "ఎంఈఓలు ఏరి" కథనానికి ఆయన స్పందించారు. జోన్-3 పరిధిలో ఇప్పటికే 71 ఖాళీలు ఉండగా 35 మంది ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు (ఎఫ్‌ఏసీ) బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మిగిలిన ఖాళీలు త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయుల జీతాల బిల్లులు, పర్యవేక్షణ కోసం కొంతమంది ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జి ఎంఈవోలుగా నియమించినట్లు పేర్కొన్నారు. జోన్-3(గుంటూరు, ప్రకాశం నెల్లూరు) పరిధిలో ఉన్నందున ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం హెచ్‌ఎంను పుల్లల చెరువు, వెల్దుర్తి మండలాలకు (ఎఫ్‌ఏసీ) ఎంఈఓగా నియమించినట్లు చెప్పారు. త్వరలో ఎంఈఓ 1 పోస్టులు ఉద్యోగోన్నతులు, మరికొన్ని బదిలీల ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆర్జేడీ తెలిపారు.

వంకాయలు కిలో రూ.4

- పడిపోయిన ధరతో పారపోస్తున్న రైతులు
- కోత కూలి, రవాణా ఖర్చులు రాక ఆవేదన

అద్దంకి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పది కేజీల వంకాయలు రూ.200 నుంచి 250 వర కు ఉన్న ధర ఒక్కసారిగా పడిపోయింది. మార్కెట్‌లో ఆదివారం కేజీ రూ.4 పలికింది. దీంతో కోత కూలి, రవాణా ఖర్చులు కూడా రావని రైతులు రోడ్లపై పారపోశారు. వంకాయల ధర ఒక్కసారిగా తగ్గిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. రెండు, మూడు రోజులుగా వంకాయల కొనుగోలు చేసే వ్యాపారులు లేకుండా పోయారు. దీంతో డిమాండ్ పడిపోయి ఒక్కసారిగా ధర అమాంతం పడిపోయింది. కోయకుండా వదిలేస్తే మళ్లీ కాపు వచ్చే అవకాశం ఉండదని, కూలి ఖర్చులు భరించి మరీ కాయలు కోయిస్తున్నారు. మార్కెట్ వరకు తీసుకుపోతే రవాణా ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో తోటల సమీపంలోనే పారపోస్తున్నారు. వెంపరాల రైతులు మేజర్ కాల్వలో వంకాయలను పారబోయడాన్ని చూసిన పలువురు ఆశ్చర్యపోయారు.

వెంపరాల మేజర్ కాల్వలో పారబోసిన వంకాయలు



అవీ..ఇవీ..

విశ్రాంత ఆర్మీ ఉద్యోగులకు సత్కారం



విశ్రాంత సైనికులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

మార్టూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ దివాస్ సందర్భంగా శనివారం రాత్రి మార్టూరులో ఎఫర్డ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నలుగురు విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగులైన కే.రూబెన్, పత్తిపాటి హనుమంతరావు, కళ్లం నరేంద్రకుమార్ రెడ్డి,బాచిన వెంకట రామారావులను రోటరీ సభ్యులు శాలువాకప్పి, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సమయంలో నలుగురు ఉద్యోగులు తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో మాదాల సాంబశివరావు, ఇంటూరి ఆంజనేయులు, రావి అంకమ్మచౌదరి, కొర్రపాటి కాజారావు,చెన్నుపాటి బసవరాములు,చెరుకూరి నాగేశ్వరరావు, గోనుగుంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట రామారావుకు అభినందన

చినగంజాం, జూలై 27(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామానికి చెందిన మార్కాపురం వెంకటరామారావు పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షులుగా నియమింతులయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని పెదగంజాం గ్రామంలో వైసీపీ మండల అధ్యక్షులు మున్నం వెంకటనాగేశ్వరరెడ్డి ఛాంబర్‌లో ఆదివారం వెంకట రామారావును ఘనంగా సన్మానించారు. నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మండల వైసీపీ నాయకులు నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షులుగా నియమితులైన వెంకటరామారావును సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ మండల ఉపాధ్యక్షులు మేడికొండ సునీల్, కార్యదర్శి ఆసోది సూరినారాయణరెడ్డి, అగ్నికుల క్షత్రియ మాజీ డైరెక్టర్ కొల్లాటి ఏడుకొండలు, నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, అమరా శ్రీనివాసులు, వాటుపల్లి రాములు, పఠాన్ సైదా, శ్రీరాములురెడ్డిలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముస్లిం నాయకులు

చినగంజాం, జూలై 27(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మసీదుపేటలో మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతి కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మసీదుపేటలో ముస్లిం నాయకులు అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను నాయకులు కొనియాడారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎం మండల అధ్యక్షులు పఠాన్ సుభానిఖాన్, చినగంజాం గ్రామ అధ్యక్షులు షేక్ ఈసుబ్, ముస్లిం నాయకులు ఎండీ. జియావుల్ హుక్, పఠాన్ బాబు, షేక్ షాహుల్, షేక్ ఇమ్రాన్, షేక్ సాదిక్, షేక్ నాగుర్ బాలజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఫణీంద్రబాబు

అద్దంకి, జూలై27 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచితంగా వైద్యసహాయం అందించడం అభినందనీయమని టీడీపీ జిల్లా వైద్యవిభాగం అధ్యక్షుడు, రోటరీ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఫణీంద్రబాబు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం అద్దంకిలోని భవానిసెంటర్‌లో రేణింగవరం రోడ్డులో అహ్మద్ స్పెషాలిటీ క్లినిక్‌లో ఒంగోలుకు చెందిన చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్ ఐ హాస్పటల్ వైద్యులు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 120 మంది రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సాధారణ వ్యాధులకు కూడా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్య క్రమంలో వైద్యులు డాక్టర్ కర్నాటి రాహుల్‌రెడ్డి, డాక్టర్ విష్ణు ప్రియ, రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్ష, కార్యదర్శులు పూర్ణచంద్రరావు, హరి ప్రసాద్, షేక్ ఖాజావలి, దేవపాలన, రామకోటేశ్వరరావు, అంజాద్‌బాషా, లేవి ప్రసాద్, చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, తమ్మిన శ్రీనివాసరావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్థ ఏర్పాటు అభినందనీయం

● నూర్‌బాషా యువజన సంఘం అధ్యక్షుడు పెద్దమస్తాన్



సమావేశమైన నూతన కమిటీ

అద్దంకి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నూర్‌బాషా దూదేకుల అభివృద్ధికి ఆర్థిక సంస్థ ఏర్పాటు అభినందనీయం అని రాష్ట్ర నూర్‌బాషా యువజన సంఘం అధ్యక్షుడు దూదేకుల పెద్దమస్తాన్ అన్నారు. అద్దంకి పట్టణ దూదేకుల సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక షాధీఖానాలో నిర్వహించారు. అధ్యక్షుడిగా షేక్ మదీనాను ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా కొటికలపూడి శ్రీను, అద్దంకి యూత్ అధ్యక్షుడిగా ఎలిల్ సాహెబ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సైదావలి, కె.మీరావలి, ఉపాధ్యక్షులుగా అహ్మద్, అంజయ్య, గౌరవ అధ్యక్షుడు గా వేల్పూరి మస్తాన్‌వలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్య క్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దూదేకుల దావూద్, ఉపాధ్యక్షుడు అజీజ్, సర్వరాజ్, అహ్మద్, సుభాని పాల్గొన్నారు.

ట్రైనీ ఎస్సైగా వెంకటేశ్వరరెడ్డి

అద్దంకి,జూలై27(ఆంధ్రజ్యోతి): అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్సై గా వెంకటేశ్వరరెడ్డి శనివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. సీఐ సుబ్బరాజును కలిసి బాధ్యతలు స్వీకరించారు.

ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూరేలా సంక్షేమ పథకాలు

● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్

● చందలూరులో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి హాజరైన నేతలు



ఎన్‌టీఆర్ కళాక్షేత్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి రవికుమార్, పక్కన ఎంపీ కృష్ణప్రసాద్

పంగులూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో ఆదివారం సుపరిపాలన - తొలిఅడుగు కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తల్లికివందనంతో పాటు పింఛన్లు, వంటగ్యాస్ సిలిండర్లు ఏ మేరకు అందాయో అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీ ప్రజలు తాగునీరు అందడం లేదని, నివేశన స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నామని మంత్రి రవికుమార్‌కు సమ స్యలను వివరించారు. గ్రామంలో ఇంటింటికీ కుళాయి ద్వారా నీరందించేందుకు జలజీవన్ మిషన్‌ద్వారా రూ.57 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడు తున్నట్లు తెలిపారు. కాలనీ వాసులకు నివేశన స్థలాల సమస్య త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు.

ఎన్‌టీఆర్ విగ్రహం, కళావేదిక ప్రారంభం

అనంతరం గ్రామంలోని రామాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్‌లు స్థానిక నేతలతో కలసి ఆవిష్కరించారు. కళావేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ గ్రామంలో రూ.30 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించామన్నారు. రూ.35 లక్షల వ్యయంతో పాఠశాల విద్యార్థులకు భోజనశాల నిర్మిస్తున్నామన్నారు. చందలూరు నుంచి గంగవరం వరకు రూ.2 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పునులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం రూ.1.50 కోట్లతో విద్యుత్ లైన్లను ఆధునికీకరించామన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రగతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.10 లక్షల వ్యయంతో గ్రామానికి చెందిన పెంట్యాల సుబ్బారావు ఎన్‌టీఆర్. విగ్రహం ఏర్పాటుతో పాటు కళావేదిక నిర్మించడాన్ని మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్‌లు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంట్యాల వెంకటకృష్ణారావు, తహసీల్దార్ సింగారావు, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ. సుబ్బారావు, పెంట్యాల రాధాకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీదర్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, డీసీ అధ్యక్షుడు కుక్కపల్లి ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు వాసవి, మురకొండ సుబ్బారావు, పెంట్యాల వెంకటేశ్వర్లు, గొట్టిపాటి వెంకటరత్నం, రావూరి సుబ్బారావు, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల ద్వారా మెరుగైన సేవలు

గ్రామంలోని ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతాంగానికి మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని చందలూరు గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడిగా అధ్యక్షునిగా నియమితులైన బెల్లంకొండ శ్రీధర్‌బాబు, సభ్యులు వట్టెం శేషయ్య, మాగులూరు సుబ్బారావులతో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.

భోజనశాల నిర్మాణానికి భూమి పూజ

పంగులూరు: మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాలలో భోజనశాల భవన నిర్మాణానికి ఎంపీ కృష్ణప్రసాద్ ఆదివారం భూమిపూజ చేశారు. పాఠశాల విద్యార్థులు సౌకర్యం కోసం భోజశాల నిర్మాణానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.35 లక్షల జడ్పీ నిధులు మంజూరు చేయించారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, హెచ్‌ఎం గిరిజ, అజిత్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, మురకొండ సుబ్బారావు, అడ్డగడ సుబ్బయ్య, పి.డి. మధు, ప్రతిమ పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్కూటీల పంపిణి

పంగులూరు : మండలంలోని పలు గ్రామాల లోని దివ్యాంగులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లు స్కూటీలను పంపిణీ చేశారు. మండలంలోని ముప్పవరం, కశ్యాపురం, బైటమంజులూరు, పంగు లూరు, చందలూరు, భగవాన్‌రాజుపాలెం, అలవలపాడు గ్రామాలకు చెందిన పదిమంది దివ్యాంగులకు స్కూటీలను అందచేశారు. ఏపీఎస్‌పీసీఎల్ అసిస్ట్ సహకారంతో రూ. 13 లక్షల విలువైన స్కూటీలను లబ్ధిదారులకు అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిల్లచెట్లతో నిండిన వెంపరాల మేజర్

నీటి ప్రవాహానికి పలుచోట్ల అడ్డంకులు



మేజర్ కాలువలో పెరిగిన చిల్లచెట్లు

అద్దంకి, జూలై 27(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువ పరిధిలో వెంపరాల మేజర్‌లో నీటి ప్రవాహానికి తిప్పలు తప్పడం లేదు. రెండు దశాబ్దాల క్రితం సాగర్ ఆయకట్టులో ఆధునికీకరణ పనులలో భాగంగా ఈ మేజర్ కాలువకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టారు. ఆ తరువాత కొద్దో గొప్పో మరమ్మతులు మినహా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. దీంతో కాలువ పలుచోట్ల దెబ్బతిని నీటి ప్రవాహంలో అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దఎత్తున నిధులు కేటాయించి మేజర్ కాలువలతో పాటు మైనర్ కాలువలకు మరమ్మతులు చేపట్టారు. అయితే కొన్నిచోట్ల అర్థాంతరంగా వదిలేసిన పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుతం సాగర్ డ్యామ్ వద్ద కుడి కాలువకు నీటి విడుదల జరిగిన నేపథ్యంలో త్వరలో ఆయకట్టుకు నీటి విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో పనులు చేయ కుండా వదిలివేసిన చోట వెంటనే పూర్తి చేయకపోతే నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారే ప్రమాదం ఉంది. ప్రధానంగా వెంపరాల మేజర్ కాలువలో సుమారు అర కిలోమీటర్ దూరం కనీసం చిల్ల చెట్లు తొలగింపు, పూడికతీత పనులు చేయకుండా వదిలేశారు. అదే సమయంలో వెంప రాల కొండ నుంచి విజయవాడ- బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు గ్రావెల్ తరలింపునకు వెంపరాల మేజర్ కాలువలో తూములు ఏర్పాటు చేశారు. అయితే భారీ వాహనాల రాకపోకలతో తూములు పగలడం, తూముల వద్ద మట్టితో పూడిపోవడంతో నీటి ప్రవాహా నికి అడ్డంకిగా మారే అవకాశం ఉంది. అసంపూర్తి పనులు పూర్తి చేయకపోతే చివరి ఆయకట్టుకు నీటి కష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందు తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంపరాల మేజర్‌లో అసంపూర్తిగా నిలిచి పోయిన పనులు వెంటనే పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పూనూరులో పేకాట డెన్..!

● అక్కడే మద్యం అమ్మకాలు

యద్దనపూడి, (మార్టూరు)జూలై27(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో ఒక వ్యక్తి తన సొంత స్థలంలోనే పేకాట డెన్‌ను నిర్వహిస్తున్నాడు. యద్దనపూడి, మార్టూరు, గన్నవరం, పూనూరు తదితర గ్రామాల నుంచి పేకాట రాయుళ్లు ఆటకు వస్తున్నారు. ఉదయం 9 గంటల నుండి రాత్రి పొద్దుపోయేవరకు, అవసరమైతే ఆటగాళ్ల కోరిక మేరకు అర్ధరాత్రైనా పేకాట నిరాటకంగా కొనసాగడానికి ఈ వ్యక్తి సహకరిస్తున్నాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి, అంతో ఇంతో పలుకుబడి గలిగిన వ్యక్తి కావడంతో అతని సొంత స్థలంలోనే గుట్టుచప్పుడు కాకుండా, ఈ డెన్‌ను ఏర్పాటుచేయడంతో, ఆటగాళ్లు కూడా రహస్యంగా ఆటకు వస్తున్నట్లు తెలిసింది. గ్రామంలో ఈ విషయం చాలా మందికి తెలిసినప్పటికీ, చూసిచూడనట్టే వదిలేస్తున్నారు. అయితే పేకాట జరుగుతున్న సమయంలో ఆటగాళ్ల నుంచి ఆటకు వంద రూపాయలవంతున అతను వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పుడిప్పుడే ఈ గ్రామంలో పేకాటకు వెళితే ఎలాంటి బెడద ఉండదని, క్షేమంగా ఆడుకుని, కుదిరితే నాలుగు రూపాయలు జేబులో వేసుకొని రావచ్చునని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఆటగాళ్లు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆటగాళ్లకు ఆటమధ్యలో ఆటవిడుపుగా వీరికి అందుబాటులో ఉండేలా మద్యం, అక్కడే ఒక వ్యక్తి అమ్మకాలు కూడా చేపట్టేవిధంగా డెన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అందుకు మద్యం అమ్మకాలు చేసే వ్యక్తి రోజుకు రూ.500 దాకా 'డెన్ రాజా'కు సమర్పించుకున్నట్లు సమాచారం. గ్రామానికి దూరంగా ఎక్కడో చెట్లలో, గుట్లలో పేకాట జరగడం చూశాంగాని, గ్రామంలోనే ఇలాంటి వాతావరణం ఎప్పుడూ చూడలేదని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పేకాట ఆడటానికి వచ్చే ఇతర గ్రామాల నుండి కాని, పూనూరు గ్రామానికి చెందిన వ్యక్తులు నుంచిగాని, క్షణికావేశంలో ఏమైనా గొడవలు జరిగితే బాధ్యులు ఎవరని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

డ్రాయింగ్, పెయింటింగ్‌పై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మేదరమెట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : దైవాలరావూరులోని కిరణ్‌జ్యోతి రిసెర్చ్ ఫౌండేషన్‌లో 12 ఏళ్లలోపు విద్యార్థులకు డ్రాయిగ్, పెయింటింగ్‌లో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆదివారం 45 మంది విద్యార్థులకు డ్రాయింగ్ పెయింటింగ్‌లో మెళకువలను రిటైర్డ్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడు మఠం వీరాంజనేయులు, తాత్కాలిక ఉపాధ్యాయుడు వేగూరి ప్రదీప్‌కుమార్‌లు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. బాల్యం నుంచే డ్రాయింగ్ పేయింటింగ్‌లో విద్యార్థులు శిక్షణ తీసుకోవడం ద్వారా ఉన్నత విద్యలో ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి కూడా డ్రాయింగ్ పేయింటింగ్ ఒక వ్యపకంగా ఉపకరిస్తుందన్నారు. శిక్షణ ఇచ్చిన వీరాంజనేయులు, ప్రదీప్‌కుమార్‌లకు సర్పంచ్ కోనూరి సీతామహాలక్ష్మి, రావిపాటి పెద్దవెంకట సుబ్బయ్య దంపతుల చేతుల మీదగా జ్ఞాపికలు అందజేశారు. ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షంవ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

యద్దనపూడి, (మార్టూరు) జూలై 27 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని పూనూరులో జీకేఅండ్ఎంకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ ఆస్పత్రివారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేషమైన స్పందన లభించింది. 1950వ సంవత్సరంలో పూనూరు జడ్పీ హైస్కూల్‌ను స్థాపించారు. దీంతో ప్రస్తుతానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం పూర్వ విద్యార్థులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ వైద్య శిబిరానికి వచ్చిన గ్రామస్థులకు కాటూరి ఆస్పత్రి వారు 8 విభాగాలకు సంబంధించి రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కొంతమందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. గుండె, లివర్, తదితర పరీక్షల కోసం ఆస్పత్రి వారు రూ.కోటి వ్యయంతో కొనుగోలు చేసిన మొబైల్ వాన్ లో రోగులకు పూర్తిగా బాడీ స్కానింగ్ పరీక్షలను వైద్యులు చేశారు. ఈశిబిరంలో హాస్పిటల్ హెడ్ దేవరసాయి శ్రీసన హాస్పిటల్‌కు చెందిన వివిధ విభాగాలకు చెందిన, వైద్యులు సౌమ్య, విద్యాధర్, వేదవ్యాస్, భాగ్యశ్రీ, పూజిత, ఆస్పత్రి ఇన్‌చార్జ్ రామకృష్ణ తదితరులు రోగులకు పరీక్షలు చేశారు. అదేవిధంగా కార్యక్రమాలను పూర్వ విద్యార్థులు మేడూరి కృష్ణవేణి, గన్నమనేని కృష్ణవేణి,దీవి భావనాచార్యులు,ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు,ఆ రే శ్రీనివాసరెడ్డి,ఈదల అనిల్, స్కూలుకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

పంగులూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామంలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక టీడీపీ నేతలు ఆదివారం ప్రారంభించారు. 16వ నంబరు జాతీయ రహదారి నుంచి ముప్పవరం గ్రామానికి ఉత్తరం వైపుగా, ఇంకొల్లు, అద్దంకి రోడ్డును కలుపుతూ ఈ బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఒకటిన్నర కిలోమీటర్ పొడవున డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.3 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేయించారు. నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏడుకొండలు, డీసీ చైర్మన్ కుక్కపల్లి ఆంజనేయులు, జె.వి.పాలెం పీఏసీఎస్ అధ్యక్షులు అల్లంనేని బ్రహ్మానందస్వామి పాల్గొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ముప్పవరం ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య తీరుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాలయోగి గోశాలలో అగ్ని ప్రమాదం

● సుమారు 20 ఎకరాల గడ్డివాము దగ్ధం

వేటపాలెం (చీరాల), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని చల్లారెడ్డిపాలెం బాలయోగి ఆశ్రమంలో అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. అకస్మాత్తుగా అందులోని గోశాల గడ్డివాముల నుంచి మంటలు చెలరేగాయి. దీంతో 20 ఎకరాలు గడ్డివాము అగ్రికి ఆహుతైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శ్రమించాల్సి వచ్చింది. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

42మందికి ఉద్యోగావకాశాలు

మద్దిపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 42మందికి ఉద్యోగావకాశాలు లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజయాదవ్ తెలిపారు. మిడ్‌వెస్ట్, హెటిరో, సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ వంటి సంస్థలు హాజరయ్యాయి.

శనగ అ'ధర'గా..

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం 19 వేల హెక్టార్లకు పడిపోయింది. చీడపీడల బెడద, ప్రకృతి విపత్తుల కారణాలతో చాలా మంది రైతులు శనగ సాగుకు స్వస్తి చెప్పారు.

మార్క్‌ఫెడ్‌కు క్వింటా కూడా రాలేదు...

గతంలో మార్క్‌ఫెడ్ శనగ మద్దతు ధర రూ.5,650గా నిర్ణయించింది. కానీ, ఒక్క క్వింటా కూడా రైతులు మార్క్‌ఫెడ్‌కు విక్రయించలేదు. నిబంధనల ప్రకారం ఎర్రశనగను కొనడానికే మార్క్ ఫెడ్‌కు అవకాశం ఉంది. తెల్ల శనగ కొనడానికి వీలు లేదు. ఎర్ర శనగ విషయంలో డీస్టోన్ చేసి అంటే మట్టి పెళ్లలను తొలగించడంతో పాటు శుభ్రం చేసిన వాటినే మార్క్‌ఫెడ్ కొంటుంది. ఇవన్నీ చేయాలంటే రైతుకు క్వింటాకు అదనంగా రూ.600 వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. అంటే మద్దతు ధర నికరంగా అన్నదాతకు చేరేది కేవలం రూ.5,050 కావడంతో రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోళ్ల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ధర కోసం ఎదురుచూడలేని రైతులు రూ.300లు తక్కువకు బయటి మార్కెట్‌లోనే తమ దిగుబడులు అమ్ముకున్నారు. ఆర్థిక వెసులుబాటు ఉన్న రైతులు తమ దిగిబడులను కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచుకున్నారు. ప్రస్తుతం పెరిగిన ధర పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బుర్లవారిపాలెంలో తాగునీటి ఇక్కట్లు

● మౌలిక వసతులు కూడా లేక అవస్థలు

● తమ గోడు పట్టించుకోవాలని వినతి



బుర్లవారిపాలెం వ్యూ

బుర్లవారిపాలెం(చీరాల), జూలై 27 : చీరాల పరిధిలో బుర్లవారిపాలెంవాసులకు తాగు నీరు లేక గొంతెండుతుంది. గ్రామంలో దాదాపుగా అందరూ నిరుపేద కుటుంబీకులే. ఇదిలా ఉంటే పంచాయతీ పాలకులు గతంలో అధికారులు గ్రామంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. అదికూడా కొద్దికాలం అరకొరగానే నడిచింది. ప్రస్తుతం పూర్తిగా మరమ్మతులకు గురై మూలనపడింది. దీంతో ప్రజలు ప్రయివేటు వ్యక్తులు వాహనాల ద్వారా తెచ్చే నీటిపై ఆధారపడ్డారు. ఒకవేళ వారు సకాలంలో రాకపోతే వీరి పరిస్థితి ఊహించలేనిది. అంతే కాకుండా నివాసాల్లోని యువకులు, పురుషులు వేటకు వెళ్లి ఒక్కోసారి వారం రోజులపాటు సముద్రంలోనే ఉంటారు. ఈ సమయంలో ఇంట్లో ఉన్న వృద్ధులు, మహిళలు తాగునీరు కోసం పాట్లు పడుతున్నారు. మరో వైపు గ్రామంలో అధిక శాతం రోడ్లు శిథిలావస్థకు చేరాయి. రోడ్లు గుంతల మయంగా ఉన్నాయి. పైగా వీధి దీపాలు కూడా పూర్తిగా లేవు. ఈక్రమంలో రాత్రి సమయాల్లో రాకపోక లకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం లోపం మెండుగానే ఉంది. చెత్త సేకరణలో అధికారులకు చిత్తశుద్ధి లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీధుల వెంబడి చెత్త పేరుకు పోయి దుర్వాసనలు వెద జల్లుతున్నాయి. నెలలు తరబడి తాగునీరు లేక అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోలేక పోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు మౌలిక వసతులు కల్పించి ఆదరించాలని గ్రామస్థులు కోరుకుంటు న్నారు.

తాగునీరు లేక ఇబ్బందులు



పంచాయితీకు చెందిన ఆర్వో ప్లాంట్ మూలనపడి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో తాగేందుకు నీరు అందక గ్రామంలో పెద్ద చిన్న తేడా లేకుండా అందరం చాలా ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు గ్రామస్థులకు తాగు నీరు అందించాలి

రాజేశ్వరి, స్థానికురాలు

మౌలిక వసతుల కల్పనలో చిత్తశుద్ధి లేదు



గ్రామంలో రోడ్లు సక్రమంగా లేవు. వీధి దీపాలు అరకొరగానే ఉన్నాయి. పారిశుధ్యంలో లోపం ఉంది. చెత్త సేకరణ సమస్య చాలా ఉంది. ప్రధాన రహదారులు మినహా వీధుల్లోకి కార్మికులు రావడం లేవు. దీంతో గ్రామంలో సమస్యల వలయంగా మారింది. అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించాలి

వెంకటేశ్వరమ్మ, స్థానికురాలు

దోషుల్ని తేల్చారు..

- జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ పూర్తి
- ప్రభుత్వానికి మైనింగ్‌శాఖ నివేదిక

దండనే మిగిలింది !

- డిమాండ్ నోటీసుల జారీ, ఆపై కోర్టుకు కాంట్రాక్టర్లు
- సర్కార్ చర్యలపై సర్వత్రా ఉత్కంఠ

నెల్లూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పెన్నానది ఒడ్డునే జిల్లా ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఇసుక దొరకడం గగనంగా మారింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా దొరికే ఇసుకను, వైసీపీ ప్రభుత్వం విక్రయించేది. నాడు ట్రాక్టర్ ఇసుక రూ.1500 వస్తే వైసీపీ ప్రభుత్వంలో రూ.5 వేలకు పెరిగింది. కానీ జిల్లా నుంచి మాత్రం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు యథేచ్ఛగా ఇసుక తరలివెళ్లింది. నాడు ఒక్క అధికారి కూడా ఆ లారీలను పట్టించుకున్న దాఖలాలు లేవు. గతేడాది ప్రభుత్వం మారడంతో ఇసుక అక్రమాల డొంక కదిలింది.

● వెలుగులోకి అక్రమాలు

పెన్నాలో మొత్తం 15 ప్రాంతాల్లో మైనింగ్ అధికారులు దాదాపు నెలపాటు విచారణ జరిపి గుంతల కొలతలు తీసి అక్రమాలు నిగ్గు తేల్చారు. అదే సమయంలో ఏసీబీ అధికారులు కూడా రంగంలోకి విచారణ ప్రారంభించారు. ఈ రెండు విభాగాలు వేర్వేరుగా విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదికలు అందజేశాయి. మొత్తం ఈ 15 ప్రాంతాల్లో 8.76 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతులిస్తే, ఏకంగా 28.13 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వినట్లు నిర్ధారించారు. ఇం దుకు సంబంధించి ఇటీవల ఆయా కాంట్రాక్టర్లకు మైనింగ్ అధికారులు నోటీసులు ఇవ్వగా, వీటిపై కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు ప్రభుత్వం అక్రమార్కులపై తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది.

2022 నుంచి రీచ్‌ల వారీగా ఇసుక అక్రమాల వివరాలు

ప్రాంతం	అనుమతిచ్చింది (మెట్రిక్ టన్నులు)	తవ్వింది (మెట్రిక్ టన్నులు)	అక్రమ తవ్వకం (రూ.కోట్లలో)	పెనాల్టీ
వేగూరు	---	1,86,187	1,86,187	37.23
కోడూరుపాడు	---	74,395	74,395	14.87
లేగుంటపాడు	---	1,13,816	1,13,816	22.76
ముదివర్తి-1	37,637	1,52,969	1,15,333	23.06
ముదివర్తి-2	72,000	3,50,376	2,78,376	55.67
ముదవర్తి-3	72,600	79,853	7253	1.45
ముదవర్తి-4	70,350	1,36,580	66,230	13.24
పీకేపాడు	73,755	1,25,500	51,745	10.34
పల్లిపాడు-1	72,150	3,07,154	2,35,004	47
పల్లిపాడు-2	74,100	1,32,938	58,838	11.76
వెంకటేశ్వరపురం	--	25,786	25,786	5.15
విరువూరు	73,350	2,58,350	1,85,000	37
గొల్లకందుకూరు	2,17,200	2,51,916	34,716	6.94
మినగల్లు	73,350	3,03,483	2,30,133	46.02
సూరాయపాలెం	40,500	3,14,000	2,73,500	54.70
మొత్తం	8,76,992	28,13,303	19,36,312	387.26

● డిమాండ్ నోటీసుల జారీ

విరువూరు, ముదివర్తి, పల్లిపాడు, మినగల్లు ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిపినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది సెప్టెంబరులో ప్రభుత్వానికి అందజేసిన నివేదిక ప్రకారం పై నాలుగు ప్రాంతాల్లో సగం అక్రమాలు జరిగాయి. ఇక వేగూరు, కోడూరుపాడు, లేగుంటపాడు, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో రీచ్‌లు లేకపోయినా అక్రమార్కులు ఇక్కడ తవ్వకాలు జరిపారు. గత ప్రభుత్వంలో రెండు సంస్థలకు ఇసుక తవ్వకాలను అప్పగించారు. ఈ రెండింటికి మైనింగ్ అధికారులు డిమాండ్ నోటీసులు అందించారు. అనుమతులకు మించి తవ్వకాలు జరిపినందుకు పెనాల్టీలు చెల్లించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే ఈ నోటీసులపై సదరు కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయిం చారు. ఇటీవల ఈ పిటిషన్లకు సంబంధించి హైకోర్టు నుంచి స్టే ఉత్తర్వులు అందగా.. వీటిపై మైనింగ్ అధికారులు కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది.



● మొదట ఇంకెంతో..!

జరిగిన విచారణ అంతా 2022, 2023లో జరిపిన తవ్వకాలకు సంబంధించిందే. 2021 వరకు జరిగిన తవ్వకాలన్నీ అప్పుడు వచ్చిన భారీ వరదతో కనుమరుగయ్యాయి. ఇందుకు సంబంధించి శాటిలైట్ ఇమేజస్ ద్వారా విచారణ చేసేందుకు ప్రభుత్వం గతేడాది ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు శాటిలైట్ ఇమేజస్ సాయంతో మైనింగ్ అధికారులు లోతుగా విచారణ జరిపారు. ఇక్కడ కూడా భారీగా అక్రమాలు బయటపడినట్లు సమాచారం. ఈ సమాచారాన్ని కూడా ఇటీవల మైనింగ్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు.

నోటీసులు ఇచ్చాం...

ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ జరిపాం. అనధికార తవ్వకాలను గుర్తించి కాంట్రాక్టర్లకు డిమాండ్ నోటీసులు ఇచ్చాం. అయితే వారు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. వీటికి కౌంటర్ వేస్తున్నాం.

- శ్రీనివాసరావు, మైనింగ్ డీడీ



కరేడు వెళ్లే జాతీయ రహదారి వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

కరేడులో పోలీసు పహారా

- నెలాఖరు వరకు పోలీసు యాక్ట్
- బయటవారికి అనుమతి నిరాకరణ
- సభలు, సమావేశాలు రద్దు

ఉలవపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు గ్రామంతో పాటు, శివారు గ్రామాలు పోలీసు పహారాలో ఉన్నాయి. ఆదివారం నుంచి కందుకూరు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులోకి వస్తుందని డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. బయట వ్యక్తులకు కరేడు గ్రామంలోకి ప్రవేశం లేదన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించేందుకు అనుమతులు లేవని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఉలవపాడు పోలీసు స్టేషన్‌కు ఆదివారం ఉదయాన్నే సుమారు 300 మంది పోలీసులు వచ్చారు. కరేడు గ్రామానికి వెళ్లే అన్ని మార్గాలను ప్రత్యేక దళాలతో గస్తీ ఏర్పాటు చేశారు. అనుమానితులను తనిఖీ చేసి గ్రామాల్లోకి అనుమతిస్తున్నారు.

● నిర్బంధంతో భూములు లాక్కోలేరు..

మా సమ్మతి లేకుండా ఎంతమంది పోలీసులైనా మోహరించినా ఎకరా భూమిని కూడా ప్రభుత్వం తీసుకోలేదని కరేడు రైతులు ఘంటాపథంగా చెప్తున్నారు. అమాయకులపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేసి గ్రామాలను తరలించాలని చూస్తున్నారని వారు పేర్కొన్నారు. ఇందులో భాగంగారు పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మండలం కరేడు రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళుతున్న బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్‌ను వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఆదివారం పోలీసులు అడ్డుకున్నారు. అక్కడికి వెళ్లేందుకు అనుమతి లేదని నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆయన వాహనాన్ని చుట్టుముట్టారు.దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఒకానొక దశలో పోలీసుల తీరుపై ఆయన మండిపడ్డారు. పోలీసులు ససేమిరా అనడంతో చివరకు అక్కడి నుంచి వెనుతిరిగారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మీడియాతో మాట్లాడుతూ కరేడు రైతుల మనోభావాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం 8300 ఎకరాల భూములను బలవంతంగా తీసుకోవాలని ప్రయత్నిస్తున్నదన్నారు. రైతులతో మాట్లాడేందుకు వెళ్తున్న తనను అడ్డుకోవడం దారుణమన్నారు. కచ్చితంగా పోలీ సుల అనుమతితో మళ్లీ కరేడుకు వెళ్తానన్నారు. అక్కడి రైతులకు న్యాయం జరిగేంతవరకు పోరాటానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ఉద్రిక్తత

కరేడు రైతులకు మద్దతుగా రామచంద్ర యాదవ్

గ్రామానికి వెళ్లేందుకు అనుమతి లేదన్న పోలీసులు



బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు

సోమశిలకు పెరుగుతున్న వరద

● 12,113 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం జూలై 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరుగుతోంది. శనివారం 10,151 క్యూసెక్కులు రాగా ఆదివారానికి 12,113 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు నీటి సరఫరా పెంచడంతో కుందూనది నుంచి సోమశిలకు వరద చేరుతోంది. ప్రస్తుతం డ్యాంలో 29.712 టీఎంసీలు నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నా డెల్టాకు 1,725 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. వస్తున్న వరదతో నీటిమట్టం పెరుగుతుండగా అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● కండలేరులో...

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తిస్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 27.200 టీఎంసీలుగా ఉందని డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య తెలిపారు. ఇన్‌ఫ్లో లేకపోగా, అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2210 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ నుంచి 100 క్యూసెక్కులు ఉందని ఆయన తెలిపారు.

బాబూ... చూసుకుని తాగు !

- కాలం చెల్లిన బీర్లు, బ్రీజర్లు విక్రయిస్తే 14405కి ఫిర్యాదు చేయండి
- జిల్లాలో స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- ఇటీవల గుంటూరులో ఎక్స్‌పైర్ డేట్ సరుకు విక్రయం

నెల్లూరు(క్రైం), జూలై 27(ఆంధ్రజ్యోతి): యువత బీర్లు ఇష్టంగా తాగుతుంటారు...అయితే బీరు తయారు చేసిన తేదీ నుంచి ఆరునెలల వరకు మాత్రమే ఎక్స్‌పైర్ డేట్ ఉంటుంది. ఇక బ్రీజర్‌కు ఏడాదికాలం ఎక్స్‌పైర్ డేట్ ఉంటుంది. మందు బాబులూ... లిక్కర్ విషయం పక్కన పడితే బీర్లు, బ్రీజర్ల విషయంలో మాత్రం మీరు జాగ్రత్తగా ఉండాల్సిందే..! ఎక్స్‌పైర్ డేట్ తరువాత వాటిని తాగడం, ఆరోగ్యానికి హానికరమని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల గుంటూరు జిల్లాలోని మద్యం దుకాణాల్లో కాలం చెల్లిన బీర్లను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బార్లు, మద్యం దుకాణాల్లో కాలం చెల్లిన బీర్లు, బ్రీజర్లపై ఎక్సైజ్ శాఖ తనిఖీలు చేపట్టింది. స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులతో పాటు జిల్లా అధికారులు ప్రత్యేక బృందంగా ఏర్పడి జిల్లాలోని బార్లు, మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు.



వింజమూరు ప్రాంతంలోని మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

● డేట్ గమనించాలి..

బార్లు, మద్యం దుకాణాల్లో బీర్లు, బ్రీజర్లు కొనుగోలు చేస్తున్న మందుబాబులు వాటిపై ఉన్న ఎక్స్‌పైర్ డేట్‌ను పరిశీలించాలి. కాలం చెల్లినవాటిని ఇస్తే వెంటనే 14405 నంబరుకు ఫిర్యాదు చేస్తే ఎక్సైజ్ అధికారు లు చర్యలు తీసుకుంటారు.

భారీగా చలానాలు



కాలం చెల్లిన బీర్లు, బ్రీజర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుం టాం. వాటిపై ఫిర్యాదులు అందితే విక్రయిస్తున్న మద్యం దుకాణాలు, బార్లపై రూ.2 లక్షలకుపైగా అపరాధ రుసుము విధిస్తాం. కాలం చెల్లిన బీర్లు, బ్రీజర్లు ఉంటే వాటిని మద్యం డిపోకు అందిస్తే వాటి స్థానంలో వేరే వాటిని అందిస్తాం.

-శ్రీనివాసనాయుడు, ఎక్సైజ్ సూపరింటెండెంట్

- రోజూ 9 గంటలకు కార్యాలయంలో ఉండాల్సిందే..
- విధుల నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ

ఎంఈవోలకూ హాజరే!



నెల్లూరు(విద్య), జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్న ఎంఈవోలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వీరిపై ఇటీవల ఫిర్యాదులు, ఆరోపణలు అధికమవుతున్న నేపథ్యంలో వారికి చెక్ పెట్టేందుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ రంగంలోకి దిగారు. ఇప్పటివరకు తమకు నచ్చిన సమయంలో కార్యాలయానికి వెళుతున్న ఎంఈవోలు, ఇకపై ప్రతిరోజూ ఉదయం 9 గంటలకే కార్యాలయానికి హాజరు కావాలని ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో ఫేస్ రికగ్నేషన్ హాజరు వేసుకోవడంతో పాటు నిత్యం ఓ పాఠశాలను తనిఖీ చేసి నివేదికలు అందచేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లాలోని 38 మండలాల్లో ఎంఈవో-1, ఎంఈవో-2లు పనిచేస్తున్నారు. వీరిలో ఎంఈవో-2లు 37 మండలాల్లో పనిచేస్తుండగా, ఎంఈవో-1లు మాత్రం 18 మండలాల్లో ఉండగా 20 మండలాల్లో ఇన్‌చార్జ్‌లే కొనసాగుతున్నారు. వీరంతా కూడా నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు విద్యాశాఖలో వినిపిస్తున్నాయి. మండలానికి ఇద్దరు ఉండడంతో వారిలో ఆధిపత్య పోరు ప్రారంభమై విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ఎంఈవోలు తాము పనిచేసే మండలాల్లో కాకుండా ఎక్కడో నగరాల్లో దూరంగా నివాసం ఉండడంతో వీరు నిత్యం ఆయా మండలాలకు వచ్చే పరిస్థితి కూడా లేదు. ఎప్పుడో ఒకసారి కార్యాలయానికి రావడం, మరికొంత మంది ఎంఆర్‌సీ కేంద్రాలకు వెళ్లకుండా పాఠశాలల తనిఖీ పేరుతో కాలక్షేపం చేయడం తదితర వ్యవహారాలన్నీ కూడా కమిషనర్ దృష్టికి వెళ్లడంతో వీరిపై ప్రత్యేక దృష్టి సారించారు.

● జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు.

ప్రతిరోజూ ఉపాధ్యాయుల హాజరు నివేదికలను పంపించిన తరహాలోనే ఎంఈవోలు, ఇతర సిబ్బంది హాజరును కూడా నిత్యం తనకు నివేదికలను అందచేయాలని కమిషనర్ తెలిపారు. నామమాత్రపు పాఠశాల తనిఖీలు కాకుండా ప్రతిరోజూ ఒక పాఠశాలకు హాజరై పాఠశాల పనితీరు, వసతులు, ఇతర అంశాలన్నింటినీ పరిశీలించి వివరాలు తనకు అందచేయాలన్నారు. ఇకపోతే ఎంఈవో పర్యటనలకు సంబంధించి అవసరమైతే జీపీఎస్ విధానం అమలు చేయాలని కమిషనర్ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

- ఎరువులు, పురుగు మందుల పిచికారికి డ్రోన్లు
- రైతులకు ఖర్చు తక్కువ, సమయం ఆదా
- జిల్లాకు 41 కేటాయించగా, 18 పంపిణీ
- సరఫరాకు సిద్ధంగా మరో 10
- మిగతా వాటికి దరఖాస్తుల ఆహ్వానం
- 9 రైతు బృందాల ఖాతాల్లో సబ్సిడీ నగదు జమ



నెల్లూరు రూరల్ మండలంలో రైతు బృందానికి డ్రోన్ అందజేస్తున్న డీఏవో సత్యవాణి తదితరులు (ఫైల్)

సాగులో సాంకేతికం

నెల్లూరు(వ్యవసాయం), జూలై 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ఎరువులు, పురుగు మందుల పిచికారికి రైతులకు సబ్సిడీపై డ్రోన్లు అందచేస్తున్నది. దీంతో సాగుఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. ఈ డ్రోన్లను ప్రభు త్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా రైతు బృందాలకు 80శాతం రాయితీపై అందిస్తోంది.

● నిబంధనల మార్పు

డ్రోన్ కోసం దరఖాస్తు చేసుకునే రైతుబృందాలు యూనిట్ ధర మొత్తంలో 50శాతం నగదు డిపాజిట్ చేయాలనేది నిబంధన. ఈలెక్కన దాదాపుగా రూ.5లక్షల వరకు రైతు బృందాలు బ్యాంకు ఖాతాలో జమ చేశాయి. మిగిలిన 50శాతం మొత్తం బ్యాంకు రుణంగా ఇస్తుంది. ఆ తరువాత 80శాతం రాయితీని ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఈ నిబంధనల్లో కొన్ని మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూనిట్ ధరలో 20శాతం అంటే... రైతు బృందం వాటా దాదాపు రూ.2లక్షలు మాత్రమే చెల్లించేలా మార్పు చేసింది. మిగిలిన 80శాతం బ్యాంకు రుణం ఇస్తుంది. అనంతరం 80శాతం సబ్సిడీ నగదును రైతు బృందం ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది. అందులో బ్యాంకు రూ.5.8లక్షలు జమ చేసుకుంటుంది. మిగిలిన మొత్తాన్ని రైతు బృందం డ్రా చేసుకుంటుంది. ఆ నగదు మొత్తాన్ని మూడేళ్లలోగా అసలు, వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది.

● 41 డ్రోన్ల కేటాయింపు

జిల్లాకు 41 డ్రోన్ల యూనిట్లు కేటాయించారు. ఒక్కో డ్రోన్ ఖరీదు సుమారు రూ.10 లక్షలు. ఇప్పటికే జిల్లాలో 28 రైతు బృందాలు డ్రోన్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. బ్యాంకుకు 50శాతం నగదు కూడా డిపాజిట్ చేశాయి. వీటిలో 18 బృందాలకు పంపిణీ కూడా జరిగింది. మరో 10 డ్రోన్లు పంపిణీకి సిద్ధమయ్యాయి. మరో 6 రైతు బృందాలు దరఖాస్తు చేసుకుని ఉన్నారు. మొత్తం మీద దాదాపుగా 28 యూనిట్లు పంపిణీ చేసినా, ఇంకా 13 యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి కలిగిన రైతులు బృందాలుగా ఏర్పడి దరఖాస్తులు చేసుకోవచ్చు. గ్రూపులో ఒకరు డ్రోన్ పైలట్‌గా వ్యవహరిస్తారు. ఇంటర్ చదివి, పాస్‌పోర్టు కలిగి ఉండాలి. వారికి శిక్షణ ఇచ్చిన అనంతరం డ్రోన్ అందజేస్తారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

అధునాతన పద్ధతులతో వ్యవసాయాన్ని సులభతరం చేయడంలో డ్రోన్ల పాత్ర ఎంతో కీలకం. జిల్లాకు 41 డ్రోన్ల యూనిట్లు కేటాయించారు. వారిలో 18 మందికి పంపిణీ జరగ్గా 9 రైతు బృందాల ఖాతాల్లో సబ్సిడీ నగదు జమైంది. ఇంకా 10 గ్రూపులకు డ్రోన్లను, రెండు మూడు వారాల్లో అందచేయనున్నాం. ఆసక్తి కలిగిన రైతులు బృందాలుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవచ్చు.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

● డ్రోన్‌తో ఉపయోగాలివే..

ఎకరా పొలానికి ఎరువులు, పురుగు మందుల పిచికారి చేయాలంటే సాధారణంగా మూడు, నాలుగు గంటలు పడుతుంది. తక్కువలో తక్కువగా రూ.500ల వరకు ఖర్చవుతోంది. డ్రోన్లతో ఎన్ని ఎకరాలకైనా నిముషాల్లో ఎరువులు, పురుగు మందులు చల్లుకోవచ్చు. ఎకరా పొలంలో పిచికారికి సుమారు 8 నుంచి 10 నిముషాలు సరిపోతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రూ.300ల నుంచి రూ.350వరకు ఖర్చవుతుందని అంచనా. ఈపద్ధతిలో మందులు పిచికారి చేయడం వల్ల మందులు 25శాతం వరకు వృథా కాకుండా ఉంటాయంటున్నారు. దీంతో రైతుకు మందులు, కూలీల ఖర్చులు తగ్గుతాయి. అంతేకాక పంటలు ఏదశలో ఉన్నా పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చు. దీంతో పంట దిగుబడులు పెరుగుతాయి. రోజుకు 25 నుంచి 30 ఎకరాల వరకు మందుల పిచికారి చేసుకోవడం వల్ల పైలట్లకు కూడా ఉపాధి కూడా లభించే అవకాశం ఉంది.

విద్యుత్ కోతలతో జనం ఇక్కట్లు 7లో..

సీపీఎం నేత అరెస్టుకు నేతల ఖండన

కందుకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరేడు బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాల్గొన్న సీపీఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్‌ను ఆదివారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అజయ్‌కుమార్, గుడ్లూరు, కందుకూరు సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శులు జీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఏ గౌస్‌లు పోలీసుల చర్యలను ఖండించారు.

బోర్డు అనుమతిచ్చిన మేరకే పొగాకు సాగుచేయాలి



రైతులకు సూచనలు ఇస్తున్న బోర్డు సిబ్బంది

కలిగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగుపై నియంత్రణ పాటించి రానున్న పంట సీజన్ 2025-26 కాలానికి సంబంధించి బోర్డు అనుమతిచ్చిన మేరకే పొగాకు సాగుచేయాలని వేలం నిర్వహణ అధికారి శివకుమార్ రైతులకు సూచించారు. ఆదివారం వేలం కేంద్రం పరిధిలోని కలిగిరి, కొండాపురం, దుత్తలూరు మండలాల్లోని రైతులకు పొగాకు సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ అధిక ధరలకు పొగాకు బ్యారన్లను, భూములను కౌలుకు తీసుకొని నష్టపోవద్దని సూచించారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, బోర్డు సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కందుకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కందుకూరు- సింగరాయకొండ హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. కందుకూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ... కందుకూరు పట్టణం ఖాజీపాలెంకు చెందిన పఠాన్ సాజిద (53) ఆమె కుమారుడు షాబీన్ కారులో ఒంగోలుకు వెళుతున్నారు. మార్గ మధ్యంలో రవి గార్డెన్స్ సమీపంలో ముందుగా వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో లారీని ఢీకొనడంతో సాజిదకు తీవ్ర గాయాలు కాగా, కారు నడుపుతున్న కుమారుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. సాజిదను ఒంగోలు రిమ్స్‌కు తరలించే క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలు సాజిద దొనకొండ కాలేజీలో హిందీ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తోంది. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై మహేంద్రనాయక్ తెలిపారు.

ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు



కందుకూరు : కరపత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి



వరికుంటపాడు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కందుకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు పాలన సాగిస్తున్నారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 31వ వార్డు కోవూరు రోడ్డులో సాయినగర్ 1వ లైన్ తదితర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన, చేయబోతున్న సంక్షేమ పథకా లను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వార్డుల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, అత్తంటి శివకృష్ణ, పిడికిటి వెంకటేశ్వర్లు, శ్రీనివా సులు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తన కార్యాలయంలో లబ్ధిదారులకు ఆదివారం అందచేశారు. ముగ్గురు లబ్ధిదారులకు కలిపి రూ.1,08,422 చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మనోహర్, పర్వతాలు, వెంకటేశ్వర్లు, కొండప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) :** టీడీపీ హయాంలోనే అన్నిరంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని నార్తకొండాయపాళెంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించడంతో పాటు ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్‌యాదవ్, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, టీడీపీ నాయకులు ముజ్జే లక్ష్మీనారాయణ, తెల్లగొర్ల వెంకటయ్య, నాదిండ్ల రాజేంద్ర, పొద మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత సుబ్బారెడ్డి మృతికి ప్రముఖుల సంతాపం

ఉలవపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మల్లవరపు సుబ్బారెడ్డి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందగా ఆదివారం పార్టీలకు అతీతంగా మండలంలోని పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు. మధ్యాహ్నం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సుబ్బారెడ్డి పార్థీవ దేహాన్ని సందర్శించి ఘన నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం సుబ్బారెడ్డి మృతిపట్ల సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో జనం వెతలు

వలేటివారిపాలెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో జనం అల్లాడిపోతున్నారు. విద్యుత్ ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. కాలం చెల్లిన ట్రాన్స్‌పార్మర్లతోనే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో నాలుగైదు రోజులకోసారి ఎక్కడో ఒకచోట ఓవర్‌లోడుతో ట్రాన్స్‌పార్మర్లు కాలిపోతూనే ఉన్నాయి. దీంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో పరిస్థితి మరితం దారుణంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, విద్యుత్‌ను నమ్ముకొని వ్యాపారాలు చేసుకొనే చిన్న వ్యాపారులు విద్యుత్ కోతల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రైస్‌మిల్లులు, పిండిమిల్లులు, వాటర్‌ప్లాంట్‌లు, వాటర్ సర్వీసింగ్, ఫోటో స్టూడియోలు, జెరాక్స్ సెంటర్లు, టైలరింగ్ తదితర వ్యాపారస్తులు విద్యుత్ కోతలు కారణంగా తమ ఆదాయాన్ని కోల్పోతున్నారు. విద్యుత్ కోతలకు తోడు లోటల్టేజీ సమస్యతో ఇంట్లో ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులు మరమ్మతులకు గురవుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లపై పోరుబాట కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు విడుదల చేస్తున్న వామపక్ష పార్టీ నాయకులు

కందుకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆదానీ స్మార్ట్ మీటర్లపై పోరుబాట కరపత్రాలను వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ సురేష్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు కే మోహన్‌రావు, అఖిలభారత రైతుకూలి సంఘం రాష్ట్ర నాయకులు కే నాంచార్లు, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్, రాయుడు పాల్గొన్నారు.

నేటి తరానికి అబ్దుల్ కలాం ఆదర్శం



బిట్రగుంట: అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఎంఆర్ యువసేన నాయకులు

బిట్రగుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నేటి తరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని బీఎంఆర్ యువసేన అధ్యక్షుడు షేక్ సమీఉల్లా అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలో దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం వర్థంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సాతుపాటి ఉదయ్‌కుమార్, ఎంఏ బేగ్, పీ షకీల్, వేణు, అహ్మద్‌బాషా, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

●**కావలి :** ఏపీజే అబ్దుల్ కలాం వర్థంతి సందర్భంగా ఆదివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఆయనకు నివాళులు అర్పించి సభ్యులు రక్తదాన్నం చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు పఠాన్ ఖాదర్‌బాష మాట్లాడుతూ అబ్దుల్‌కలాం భారతదేశాన్ని అణుశక్తితో రక్షణపరంగా తిరుగులేని శక్తిగా మలిచారన్నారు. అనంతరం పలువురు సభ్యులు రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ గాదిరెడ్డి హరినాథ్, ప్రసన్న, అభ్యుదయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శ్రీకాంత్, శ్రీను, కిరణ్, అశోక్, సుభానీ, రాజు, వెంకటేశ్వర్లు, వసంత్, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న బిట్రగుంట వాకర్స్ సభ్యులు

బిట్రగుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని జడ్పీ స్కూల్ హెచ్‌ఎం గంగాధరరావు సూచించారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ. బర్నాడ్ ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఆదివారం జరిగింది. అసోసియేషన్ మాజీ ట్రెజరర్ పీ జీవన్‌కుమార్ విద్యార్థులకు మెమొంటోలు అందచేశారు. తైక్వాండో విద్యార్థి నూకసాని కౌశిక్ పుట్టినరోజు సందర్భంగా క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని ఎన్ఎస్‌యాదవ్ అందచేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు, విద్యార్థుల తల్లితండ్రులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి చేయూత



క్యాన్సర్ బాధితురాలికి నగదు, నిత్యావసరాలు అందచేస్తున్న సంయుక్త సేవా సంస్థ బాధ్యులు

కావలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న కావలి రూరల్ మండలం చెన్నాయపాలెంకు చెందిన శ్రీవాణి గత మూడు సంవత్సరాలుగా మంచానికే పరిమితం కావడంతో ఆమె కుటుంబాన్ని ఆదుకునేందుకు సంయుక్త సేవా సంస్థ నగదు, నిత్యావసరాలు వితరణగా అందచేసింది. సంస్థ బాధ్యులు ఆదివారం చెన్నాయపాలెం వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంయుక్త సేవాసంస్థ సభ్యులు, గురువులు, శిష్యుల సహకారంతో రూ.13 వేలు, సేవాసంస్థ నెలవారీ చందాదారుల సహకారంతో రూ.5వేల విలువచేసే నిత్యావసరాలు, బియ్యం అందచేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సీనియర్ సభ్యులు ఎంవీఎన్ ప్రసాద్‌రావు, షేక్ ఖాదర్‌బాష, పీ. జాఫర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాల పొంగళ్లు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంచెరువులో వెలసి ఉన్న పోలేరమ్మతల్లికి భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పాల పొంగళ్ల కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా నివాసాల నుంచి పొంగళ్ల సామగ్రిని ఊరేగింపుగా ఆలయానికి చేర్చి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి నైవేద్యాలను పంచి పెట్టారు. అనంతరం అమ్మవారిని అలంకరించి మేళతాళాలు, బాణాసంచా నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

ఆశ్రమానికి చిరుద్యోగి చేయూత

అనంతసాగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో చిరు ఉద్యోగి చేరుకూరి మనోజ్ కుమార్, వారి కుటుంబసభ్యులు ఆదివారం రాజుపాలెంలోని విశ్వజననీ బాలా ఆశ్రమానికి దుస్తులు, నిత్యవసర సరుకులు, తినుబండారాలు అందజేశారు. దీంతో వారిని ఆశ్రమ నిర్వాహకులు అభినందించారు.

ముందుగానే నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న డీలర్ ఫయాజ్

ఉదయగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు పౌర సరఫరాల శాఖ ముందుగానే నిత్యాసర సరుకుల పంపిణీని ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులకు ప్రతినెలా 26 నుంచి 30వ తేదీ వరకు డీలర్లు ఇంటికెళ్లి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా పట్టణంలోని పలువురు చౌక దుకాణాల డీలర్లు ఆదివారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు.

కొనసాగిన ఎన్‌ఎంయూఏ ఉద్యోగుల నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎంయూఏ ఉద్యోగులు

ఉదయగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో రోజైన ఆదివారం ఎన్ఎంయూఏ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థకు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెంచలస్వామి ఆరాధన మహోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేపూరు గ్రామ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆదివారం హనుమాన్‌భక్త శ్రీ పెంచలస్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పెంచలస్వామి, సాయిబాబా, అంజనేయస్వామి, వెంకయ్యస్వామి, రామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలలో నిర్వాహకులు భాస్కర్‌నాయుడు, పెంచల నాయుడు, గ్రామ సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ కన్నం వెంకటసుబ్బయ్య, దొడ్ల సుమన్, కొల్లా ఆదిశేషయ్య, తూమాటి తిరుపతి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, కొల్లి ఆదిశేషయ్య, వీరపునేని, ఐురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణలో స్త్రీ పాత్ర కీలకం



మాట్లాడుతున్న తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్ వేలూరు భారతి

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పిల్లల సంరక్షణలో స్త్రీ పాత్ర అత్యంత కీలకమైనదని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్ వేలూరు భారతి తెలిపారు. తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా మంచిమాట కార్యక్రమంలో భాగంగా మానవ పరిణామక్రమంలో స్త్రీ పాత్ర అనే అంశంపై ఆదివారం ఆత్మకూరు పట్టణంలో సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవజాతి కొనసాగింపు, సమాజ నిర్మాణం, సంస్కృతి పరిరక్షణలో స్త్రీ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. అయినా ఇప్పటికీ స్త్రీలు వివక్షకు గురవుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుభారతి సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, గౌరవాధ్యక్షుడు ఏ గోవిందరెడ్డి, సహాధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి కె రవీంద్రకుమార్, గౌరవ సలహాదారులు ఎస్వీ రమణయ్య, కెవి శేషారెడ్డి, వెలిశెట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో శ్రావణ మాసం తొలి ఆదివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పెన్నానది జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

దువ్వూరమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న దువ్వూరమ్మ గ్రామదేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మహిళలు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, పల్లకీసేవ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం



త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం చేస్తున్న ఇందూజ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యులు

సీతారామపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూజ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథముల ఇందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలి. శ్రీకృష్ణ పరమాత్మ ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగ బాధలు ప్రజలకు ఉండవని పూర్వం పెద్దలు చెప్పేవారన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జీ. ప్రసాద్, పెంచల రత్నం, సుధాకర్, నరసింహులు, నాగమ్మ, మధు, రమణారెడ్డి పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ



మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి

చేజర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో ఆగస్టు 1, 2వ తేదీలలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆదివారం చేజర్ల మండలంలోని పెరుమాళ్ళపాడు సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర దేవదాయ ధర్మా దాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విడుదల చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యం లో మంత్రి నారా లోకేష్ సహకారంతో జరిగే జాబ్‌మేళాకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 1200 నుంచి 1500 వరకు నిరుద్యోగ యువతకు అర్హతల మేరకు అక్కడికక్కడే నియామక పత్రాలు అందజేయను న్నట్లు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఐటిఐ, పాలిటెక్నిక్, ప్రయి వేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో సాంకేతిక విద్యనభ్యసించి ఖాళీగా ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే జాబ్‌మేళా ధ్యేయం అన్నారు. అదేవిధంగా సోమవారం చేజర్ల మండలంలోని కోటితీర్థం గ్రామంలో ఉదయం కోటీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం టి.కే.పాడు గ్రామంలో రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారని టిడిపి మండలాధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

అబ్దుల్‌కలాంకు ఘన నివాళులు



అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉదయగిరి, జూలై 27(ఆంధ్ర జ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆది వారం వైసీపీ మండల కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారత రత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం వర్థంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరూ అలాంటి మహానీయు లను ఆదర్శంగా తీసుకుని దేశం కోసం పాటుపడాలన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నా యకులు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, దస్తగిరి అహ్మద్, షంషీర్, వీరారెడ్డి, సలీం, బాబు, దారపనేని చెన్నయ్య పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

ఉదయగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెరువుపల్లి గ్రామానికి చెందిన తమ్ములూరి చినపెం చలయ్య రోడ్డు ప్రమా దంలో తీవ్రంగా గాయపడి చెన్నై విజయ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండ డంతో ఆదివారం జనసేన పార్టీ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే పెంచలయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరపున రూ.10 వేలు, న్యాయవాది కాకు మురళికృష్ణ బార్ అసోసియేషన్ తరపున రూ.10 వేలు అందజేశారు. పెంచ లయ్య పరిస్థితిని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి కుటుం బాన్ని ఆదుకునేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు అనంత శెట్టి ఏడుకొండలు, అల్లూరి రవీంద్ర, కల్లూరి సురేంద్రరెడ్డి, కిరణ్, శ్రీనివాసులు, రసూల్, రవికుమార్, కుర్రా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : సీఐ

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని సీఐ జి గంగాధర్ తెలిపారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలో సీఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపానీయాలు సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపకూడదని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మోటారు బైకులపై ఇదరికి మించి ప్రయాణించడం నిబంధనలు అతిక్రమించడమేనని హెచ్చరించారు. రోడ్డు మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించాలని, అతి వేగంగా వాహనాలు నడపకూడదని సూచించారు. వాహనదారులు తమ వాహనానికి సంబంధించిన లైసెన్స్‌లు, డ్రైవింగ్ లైసెన్స్ తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారుకు రోడ్డు భద్రత నిబంధనలను వివరించారు. అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని తెలిపారు.



ద్విచక్ర వాహనదారులకు సూచనలు ఇస్తున్న సీఐ గంగాధర్